# ప్రజా తపన

prajathapana.com

News that matters

సంపుటి :01 సంచిక:86 బుధవారం 17 మే 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-




**సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానంగా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.**

- స్వామి వివేకానంద

# ఐదో ఏడాది మత్స్యకార భరోసా

**ప్రజా తపన , గుంటూరు :**

వైఎస్సార్ మత్స్యకార భరోసా కింద వేట నిషేధ భృతిని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. వరుసగా ఐదో ఏడాది లబ్ధిదారుల ఖాతాల్లో వేసింది. బాపట్ల జిల్లా నిజాంపట్నంలో మత్స్యకార కుటుంబాల ఖాతాల్లోకి నేరుగా డబ్బులు విడుదల చేశారు సీఎం జగన్. బటన్ నొక్కి మరీ లక్షా 23 వేల 519 మంది మత్స్యకార కుటుంబాల ఖాతాల్లో రూ.123.52 కోట్లను విడుదల చేశారు. జీవనోపాధి కోల్పోయిన 23 వేల 458 మంది మత్స్యకారులకు కూడా రూ.108 కోట్ల ఆర్థిక సాయాన్ని జమ చేశారు.సముద్రంపై వేటకు వెళ్లే మత్స్యకారులకు వేట నిషేధ కాలంలో ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున వేట నిషేధ భృతి అందిస్తున్నారు. టీపీడీ ప్రభుత్వం తొలి రెండేళ్లలో రూ.2 వేల చొప్పున ఇవ్వగా.. ఆ తర్వాత రూ.4 వేల చొప్పున ఇచ్చారు. మర, యాంత్రిక పడవలకే పరిమితం చేశారు. ఇలా సగటున 50 వేల మందికి రూ.21 కోట్ల మాత్రమే ఇచ్చారని ప్రభుత్వం చెబుతోంది. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ భృతి రూ.10 వేలకు పెంచింది. మర యాంత్రిక




పడవలతోపాటు సంప్రదాయ పడవలపై వేట జరిపే మత్స్యకార కుటుంబాలకు కూడా లబ్ధి చేకూర్చింది. ఫిష్ ఆంధ్ర బ్రాండ్ ద్వారా దేశీయ వినియోగం పెంచడంతో పాటు వాటికి అనుసంధానంగా నాలుగు వేల రిటైల్ దుకాణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇందులో 2 వేల 184 రిటైల్ దుకాణాలు అందుబాటులోకి వచ్చాయి. అంతేకాకుండా మత్స్య, ఆక్వా రైతులకు సేవలు అందించేందుకు వీలుగా అభివృద్ధి చేసిన వెబ్ అప్లికేషన్ ఈ మత్స్యకార్ తో పాటు టోల్ ఫ్రీ నెంబర్

02

## కొత్త పార్లమెంట్ ప్రారంభానికి సర్వం సిద్ధం



**ప్రజా తపన ,న్యూఢిల్లీ :**

ఆధునిక భారతదేశ వైభవానికి చిహ్నం.. వైవిధ్యాన్ని ప్రతిబింబించే ప్రాంతీయ కళల సమాహారం.. చేతికళలతో రూపుదిద్దుకున్న కొత్త పార్లమెంట్ భవన ప్రారంభోత్సవానికి వేగంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. మోడీ ప్రభుత్వం ఈ నెలతో తొమ్మిదేళ్లు పూర్తి చేసుకోనుంది. ఈ సందర్భంలో పార్లమెంట్ భవనంను ప్రారంభించాలని కేంద్రప్రభుత్వం అనుకుంటున్నట్లుగా తెలుస్తోంది. అంటే సరిగ్గా 26 మే 2024న నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో కొత్త పార్లమెంట్ హౌస్ ప్రారంభోత్సవ తేదీ కూడా దగ్గర పడింది. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కొత్త పార్లమెంటు భవనాన్ని ప్రారంభించే అవకాశం ఉందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీని కోసం భారీ వేడుకను

02



## హాజరు కాలేను గడువు ఇవ్వండి

**ప్రజా తపన ,హైదరాబాద్:**

వైఎస్ వివేకా హత్య కేసులో అవినాష్ రెడ్డి 19వ తేదన తమ ఎదుట హాజరు కావాలని సీబీఐ మరో నోటీసు జారీ చేసింది. వాస్తవానికి ఇవాళే ఆయన సీబీఐ ఎదుట రాజరు కావాల్సి ఉంది. కానీ తనకు ముందస్తుగా నిర్ణయించిన కార్యక్రమాలు ఉన్నందున రాలేనని చివరి క్షణంలో అవినాష్ రెడ్డి లేఖ రాశారు. నాలుగు రోజుల పాటు రాలేనని చెప్పారు. దీంతో సీబీఐ అధికారులు ఆయనకు మరో అవకాశం ఇచ్చారు. 19వ తేదీన హాజరు కావాలని ఆదేశించారు.వైఎస్ అవినాష్ రెడ్డి హాజరువుతారని ఉదయం వరకూ ప్రచారం జరిగింది. ఆయన నిన్ననే పులివెందుల నుంచి హైదరాబాద్ వచ్చారు. ఉదయం నుంచి సీబీఐ కార్యాలయం వద్ద పులివెందల నుంచి వచ్చిన అవినాష్ రెడ్డి అనుచరులు గుమికూడారు. అయితే చివరి క్షణంలో అవినాష్ రెడ్డి ఆగిపోయారు. తాను విచారణకు రాలేనని

02

# ప్రతి ఒక్కరికి ఉచిత విద్యుత్ కనెక్షన్

**ప్రజా తపన ,విజయవాడ:**

అర్హతనే ప్రమాణికంగా చేసుకొని దరఖాస్తు చేసిన ప్రతి ఒక్క రైతుకు ఉచిత వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ను అందించాలని రాష్ట్ర ఇంధన, అటవీ, పర్యావరణ, శాస్త్ర-సాంకేతిక, గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని మూడో బ్లాక్ లో సోమవారం సిపిడిసిఎల్ విద్యుత్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

**రైతులకు అండగా వైసీపీ సర్కార్...**

రైతులకు వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలవాలన్న లక్ష్యంతో తొమ్మిది గంటల పాటు పగటిపూట



ఉచితంగా విద్యుత్ ను అందించే కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని అధికారులను రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. దీనికి అనుగుణంగా ఉచిత విద్యుత్ కోసం వచ్చే దరఖాస్తులకు ఎటువంటి తుది గడువు ఉండకూడదని, వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి విద్యుత్ కనెక్షన్ లను మంజూరు చేయాలని డిస్కం అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులకు జూన్ 15వ తేదీలోగా పరిష్కరించి, కనెక్షన్లను మంజూరు చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రైతుపక్షపాతిగా రాష్ట్రంలో వ్యవసాయానికి తొమ్మిది గంటల పాటు నాణ్యమైన విద్యుత్ ను అందిస్తున్నారని, దీనిని సమర్థంగా అమలు చేసేందుకు అధికారులు అత్యంత ప్రాధాన్యత

02



## కర్ణాటక సీఎం గా సిద్ధూ!!

**ప్రజా తపన ,బెంగళూరు :**

జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే కర్ణాటక సీఎం పదవిపై కాంగ్రెస్ అధిష్ఠానం ఓ క్లారిటీకి వచ్చినట్టు కనిపిస్తోంది. అందుకే డీకే శివకుమార్‌ను ఢిల్లీ పిలిపించుకొని మాట్లాడబోతుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కర్ణాటక నూతన

02

# జనరిక్ మందులే వాడాలి

### డాక్టర్లకు కేంద్రం సూచన

**ప్రజా తపన ,హైదరాబాద్:**

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే ఆసుపత్రులు, వెల్నెస్ సెంటర్లలో ఇక నుండి తప్పకుండా జనరిక్ మందులను మాత్రమే రోగులకు రాయాలని కేంద్రం తేల్చి చెప్పింది. జనరిక్ మందులను సిఫార్సు చేయని వైద్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ మేరకు కేంద్ర సర్కారు హెచ్చరించింది.ప్రభుత్వ ఆస్పత్రులు, కేంద్ర సర్కారు ఆరోగ్య పథకం కింద నడిచే వెల్ నెస్ సెంటర్లు, పాలీ క్లినిక్ లలో ఇక నుండి రోగులకు జనరిక్



మందులను మాత్రమే సిఫార్సు చేయాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ అతుల్ గోయల్ వెల్లడించారు. కొంత మంది డాక్టర్లు చాలా సందర్భాల్లో ప్రసిద్ధ బ్రాండ్లకు చెందిన

02

# ఇవాళే గులాబీ కీలక సమావేశం

**ప్రజా తపన ,హైదరాబాద్:**

భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ మరోసారి కీలక సమవేశం నిర్వహిస్తున్నారు. కేసీఆర్ అధ్యక్షతన ప్రజా ప్రతినిధుల సమావేశం నిర్వహించనున్నారు. తెలంగాణ భవన్‌లో మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం జరుగుతుంది. కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ లెజిస్లేటీవ్, పార్లమెంటరీ పార్టీ భేటీ ఉంటుందని.. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరూ హాజరు కావాలని ఇప్పటికే సమాచారం పంపారు. బీఆర్ఎస్



ప్రజాప్రతినిధుల సమావశంలో కేసీఆర్ ఎలాంటి నిర్ణయం ప్రకటిస్తారన్న దానిపై స్పష్టత లేదు. మొన్నటిదాకా ఇలా ప్రజాప్రతినిధులు లేదా కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేస్తే ముందస్తు ఎన్నికల గురించి ఏమైనా చెబుతారేమో అనుకునేవారు. అయితే ఇప్పుడు ఆ సమయం దాటిపోయింది. వచ్చే ఆరు నెలల్లోనే తెలంగాణలో ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పుడు ప్రభుత్వాన్ని రద్దు చేసినా ఎన్నికలు షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయి కాబట్టి అలాంటి నిర్ణయం తీసుకునే అవకాశం లేదు. ఎన్నికలకు ఎలా సిద్ధం కావాలన్న దానిపై ప్రజా ప్రతినిధులకు కేసీఆర్ దిశానిర్దేశం చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. గత కొన్నిసమావేశాల్లో కొంత మంది ఎమ్మెల్యేల తీరుపై కేసీఆర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దళిత బంధు పథకాల్లో నిధులు కూడా .. పేదల వద్ద

02

ప్రజాతపన
prajathapana.com

# ఐదో ఏడాది మత్స్యకార భరోసా

(మొదటిపేజీ తరువాయి)

155251 ను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చింది. 2012లో జీఎస్‌పీసీ తవ్వకాలతో అప్పట్లో జీవనోపాధి కోల్పోయిన 14,824 మత్స్యకార కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం రూ. 70.04 కోట్ల పరిహారం చెల్లించింది. ఈరోజు అందించిన ఆర్థిక సాయంతో కలిపి ఇప్పటి వరకు వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం కింద మొత్తం సాయం రూ. 526 కోట్లు ప్రభుత్వం అందించింది. వైఎస్ జగన్ ప్రభుత్వంలో వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం ద్వారా సముద్రంలో చేపల వేట నిషేద సమయంలో ఇచ్చే భృతిని రూ. 10 వేలకు పెంచి మర, యాంత్రిక పడవలతో పాటు సంప్రదాయ పడవలపై వేట జరిపే మత్స్యకార కుటుంబాలను కూడా చేర్చి చెల్లిస్తోంది.గతంలో డీజిల్ ఆయిల్‌పై సబ్సిడీ లీటర్‌కు రూ. 6.03 ఉంటే వైసీపీ ప్రభుత్వం రూ. 9కి పెంచింది. స్మార్ట్ కార్డులు జారీ చేసి డీజిల్ పోయించుకునేటప్పుడే సబ్సిడీ లబ్ధిదారులకు నేరుగా అందేలా ఏర్పాటు చేసింది. వేట చేస్తూ మరణించిన మత్స్యకార కుటుంబాలకు చెల్లించే పరిహారం రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ. 3,606 కోట్ల వ్యయంతో 9 ఫిషింగ్ హర్బర్లు, 4 ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల నిర్మాణం వేగంగా కొనసాగుతోంది. గత ప్రభుత్వం సముద్రంపై చేపల వేట నిషేద కాలంలో మత్స్యకార కుటుంబాలకు కేవలం రూ. 4 వేలు చెల్లించేది.

14ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నా కూడా చంద్రబాబు పేరు చెబితే ఒక్క సంక్షేమ పథకం కూడా ప్రజలకు గుర్తుకు రాదని సిఎం జగన్ ఎద్దేవా చేశారు. మత్స్యకార భరోసా నిధుల విడుదల సందర్భంగా బాపట్ల జిల్లా నిజాంపట్నంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌పై సిఎం జగన్ నిప్పులు చెరిగారు. చంద్రబాబు పేరు చెబితే ఒక్క మంచి చేసినట్లు ఎవరికి గుర్తుకు రాదని, బాబు పేరు చెబితే వెన్నుపోటు మాత్రమే గుర్తుకు వస్తుందన్నారు. వెన్నుపోటు, మోసం, కుతంత్రాలు మాత్రమే బాబు అనగానే గుర్తుకు వస్తాయని, పేదలకు ఏ మంచి చేయని చంద్రబాబుకు ఎవరైనా ఎందుకు మద్దతిస్తారని ప్రశ్నించారు. చంద్రబాబుకు మరో వైపు ఇంకొరు ఉన్నారని, రెండు సినిమాల మధ్య షూటింగుల్లో విరామంగా పొలిటికల్ మీటింగులు పెడతారని, పవన్ కళ్యాణ్ను సిఎం ఎద్దేవా చేశారు. బాబు కాల్షీట్ల ప్రకారం ప్యాకేజీ స్టార్ వచ్చి మాట్లాడి పోతారని, ప్రభుత్వం మీద నాలుగు రాళ్లు వేసి పోతారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో మత్స్యకారులకు అరకొర సాయం మాత్రమే అందిందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విమర్శించారు. టీడీపీ హయాంలో రూ. 4 వేల మాత్రమే ఇచ్చారని, అది కూడా కొందరికి మాత్రమే అందేదని అన్నారు. బాపట్ల జిల్లాలోని నిజాంపట్నంలో వైఎస్సార్ మత్స్యకార భరోసా కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు ఐదేళ్లలో కేవలం రూ.104 కోట్లు మాత్రమే ఇచ్చారని, వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క సంవత్సరంలోనే రూ.231 కోట్లు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వానికి, వైసీపీ ప్రభుత్వానికి తేడా గమనించాలని సూచించారు. టీడీపీ పాలనలో 1100 బోట్లకు మాత్రమే రాయితీ ఇస్తే.. ఇప్పుడు 20 వేల బోట్లకు సబ్సిడీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో డీజిల్ పై రూ.6 మాత్రమే రాయితీ ఇచ్చారని, వైసీపీ ప్రభుత్వ పాలనలో డీజిల్ పై రూ.9 సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. వైసీపీ పాలనను చూసి గత పాలకులు తట్టుకోలేకపోతున్నారని చెప్పుకొచ్చారు. పేద వారికి సాయం చేస్తుంటే టీడీపీ నాయకులు ఓర్వలేక పోతున్నారని విమర్శించారు.ఎన్నికలు వస్తుంటే టీడీపీ అధినేత చంద్రబాబుకు బీసీ, ఎస్సీ, మైనారిటీలు గుర్తుకు వస్తారని ఎద్దేవా చేశారు. తాను మంచిని నమ్ముకున్నానని, ప్రజలను నమ్ముకున్నానని సీఎం జగన్ వ్యాఖ్యానించారు. ప్రతి అడుగులోనూ మంచి చేస్తున్నామని వెల్లడించారు. చంద్రబాబు అధికారంలో ఉంటే అమరావతిలో.. అధికారం లేకపోతే జూబ్లీహిల్స్ లో ఉంటారని సీఎం జగన్ విమర్శించారు. ఏపీలో దోచుకుని హైదరాబాద్ లో ఉండటం వీరి పని అంటూ ఆరోపించారు. ఏపీలోనే తన శాశ్వత నివాసం ఉందని, తాడేపల్లిలో ఇల్లు కట్టుకుని ఉంటున్నట్లు చెప్పుకొచ్చారు జగన్. ప్రధానులను, రాష్ట్రపతులను చేశానని చెప్పుకునే పెద్ద మనిషికి.. ఒంటరిగా ఎన్నికల బరిలోకి దిగే దమ్ముందా అంటూ జగన్ సవాల్ విసిరారు. రాష్ట్రంలోని 175 స్థానాల్లో పోటీ చేసే సత్తా చంద్రబాబు నాయుడుకు లేదని, ఆయనకు సభలు పెట్టే ధైర్యం కూడా లేదని విమర్శించారు. చంద్రబాబు, ఆయన పార్టీ వెంటిలేటర్ పై ఉందని ఎద్దేవా చేశారు. అలాంటి వాళ్లు ప్రజలకు మంచి చేయగలరా అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. బాబు, న దత్తపుత్రుడు నమ్ముకున్నది పొత్తులను, కుయుక్తులనేనని జగన్ ఎద్దేవా చేశారు. చంద్రబాబు పేరు చెబితే ఒక్క పథకం కూడా గుర్తు రాదని, ఆయన పేరు తీస్తే గుర్తుకు వచ్చేది వెన్నుపోటే అని విమర్శలు గుప్పించారు. ఎన్ని వ్యవస్థలు తనపై ప్రయోగించినా 15 ఏళ్లుగా ఎక్కడా రాజీపడకుండా, ప్రజల తరఫున నిలబడి మంచి చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు సీఎం. మీకు మంచి జరిగితే మీ బిడ్డకు తోడుగా నిలవండంటూ ప్రజలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ప్రధాన మంత్రిని కలిస్తే చాలు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని, బీజేపీ, కాంగ్రెస్ తో అంటకాగిన వాళ్లు తనను విమర్శలు చేస్తున్నారని సీఎం జగన్ మండిపడ్డారు. పొత్తులు పెట్టుకుని, తెగదెంపులు చేసుకునేది వీళ్లేనంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వివాహాలు చేసుకునేది వీళ్లే.. విడాకులు తీసుకునేది వీళ్లేనని ఎద్దేవా చేశారు



# ప్రతి ఒక్కరికి ఉచిత విద్యుత్ కనెక్షన్

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వాలని కోరారు. మార్చి నెలాఖరు నాటికి దాదాపు 1.20 లక్షల విద్యుత్ కనెక్షన్లను వ్యవసాయానికి అందించామని తెలిపారు. రాష్ట్రంలో పేదలకు ఇళ్లస్థలాలను అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం ఒక యజ్ఞంలా చేపట్టిందని రాష్ట్ర ఇంధన, అటవీ, పర్యావరణ, శాస్త్ర-సాంకేతిక, గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. వేలాది జగనన్న హౌసింగ్ కాలనీలకు విద్యుద్దీకరణను నిర్ణేశిత లక్ష్యంలోగా పూర్తి చేయాలని కోరారు. ఇందుకోసం ముమ్మరంగా పనులు జరుగుతున్న జగనన్న కాలనీకు సంబంధించిన వివరాలను గృహనిర్మాణ శాఖ అధికారుల నుంచి తీసుకోవాలని అన్నారు. విద్యుత్ పంపిణీ సంస్థల ఆధ్వర్యంలో పంపిణీ నష్టాలను పూర్తి స్థాయిలో నియంత్రణలోకి తీసుకురావాలని ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కోరారు. సిపిడిసిఎల్ పరిధిలో పారిశ్రామిక సంస్థల నుంచి రావాల్సిన బకాయిలను వసూలు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని అన్నారు. కోర్ట్ కేసుల వల్ల దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న బకాయిలపైన కూడా దృష్టి సారించాలని అన్నారు. ఇప్పటికే టెండర్లు, అవార్డుల స్థాయిలో ఉన్న సబ్ స్టేషన్ల నిర్మాణంను వేగవంతం చేయాలని ఆదేశించారు. లో ఓల్టేజీ ప్రాంతాలను గుర్తించి, అందుకు కారణాలను పరిశీలించాలని, నాణ్యమైన విద్యుత్ ను అందించేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. వేసవిలో విద్యుత్ డిమాండ్ అధికమవుతున్నా కూడా ప్రణాళికాద్ధంగా విద్యుత్ ఉత్పాదనను సాగిస్తూ, ప్రజలకు కోతలు లేకుండా విద్యుత్ ను అందిస్తున్నామని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. రాబోయే రోజుల్లోనూ ఇదే తరహాలో విద్యుత్ సరఫరా కొనసాగుతుందని తెలిపారు. 33కెవి సబ్ స్టేషన్ల పరిధిలో జవాబుదారీతనంను పెంచేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులతో సబ్ స్టేషన్ స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కమిటీలు తమ పరిధిలో విద్యుత్ డిమాండ్, లో ఓల్టేజీ, విద్యుత్ సరఫరా తదితర అన్ని అంశాలను పరిశీలిస్తాయని, మెరుగైన విద్యుత్ సరఫరా వ్యవస్థకు ఈ కమిటీలు సహకరిస్తాయని తెలిపారు.

# కర్ణాటక సీఎం గా సిద్ధూ!!

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రిగా సిద్దారామయ్యవైపు కాంగ్రెస్ అధిష్ఠానం మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది. ఢిల్లీ బయల్దేరిన ముందు డీకే శివకుమార్ చేసిన కామెంట్స్ కూడా ఈ సమాచారానికి ఊతమిస్తున్నాయి. ఎలాంటి నిర్ణయం తీసుకున్నా ఓకే అంటున్న డీకే... తనకు బ్లాక్‌మెయిల్ చేసే ఉద్దేశం లేదంటున్నారు. తనకు సోనియాగాంధీయే రోల్ మోడల్ అంటూ మరో హింట్ కూడా ఇచ్చారు.సిద్దారామయ్యకు అనుకూలంగా ఓ నిర్ణయానికి వచ్చిన హైకమాండ్ డీకేను ఎలా గౌరవిస్తుంది ఆయన వర్గీయులను ఎలా సంతృప్తి పరుస్తుంది అన్నదానిపైనే ఇప్పుడు చర్చలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. దీనిపై మాట్లాడేందుకు డీకే శివకుమార్‌ను ఢిల్లీకి పిలిపించుకున్నట్టు సమాచారం. అధిష్ఠానానికి అత్యంత సన్నిహితుడిగా డీకే శివకుమార్‌కు మంచి మార్కులే ఉన్నప్పటికీ ఆయనపై ఉన్న కేసులు పెద్ద మైనస్ అవుతున్నాయి. పార్టీ విజయానికి చాలా కష్టపడినా వాటిని కారణంగా చూపుతున్న అధిష్ఠానం ఆయనకు సీఎంగా చేయడానికి వెనుకాడుతోంది. ఆయన్ని సీఎంగా చేస్తే కేంద్రం మరిన్ని ఇబ్బందులు పాల్జేసి కర్ణాటకలో మళ్లీ ఏదైనా సమస్య తీసుకొస్తుందని కాంగ్రెస్ వాదిస్తోంది. అందుకే ఈ పరిస్థితిలో సిద్దరామయ్య లాంటి వారే కరెక్ట్‌గా హ్యాండిల్ చేయగలరని భావిస్తోంది. సిద్ధరామయ్యకు సీఎంగా ఓకే చెప్పిన తర్వాత ఆయన మంత్రివర్గంలో డీకే శివకుమార్‌కు, ఆయన వర్గానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తోంది కాంగ్రెస్. ఆయన్ని ఉప ముఖ్యమంత్రిగా చేసే ఛాన్స్ కూడా ఉందంటున్నారు. ఈయనతోపాటు పార్టీ విజయానికి కారణమైన మరికొన్ని వర్గాలకి కూడా డిప్యూటీ సీఎం పదవులు కట్టబెట్టబోతున్నారని తెలుస్తోంది. ఇద్దరితో ముఖాముఖీగా మాట్లాడి విషయాన్ని ఇవాళ తేల్చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తోంది. అందుకే ఇద్దర్నీ ఢిల్లీకి పిలిచి మాట్లాడాలని నిన్న అనుకుంది. సిద్దరామయ్య ఢిల్లీ వెళ్లినా... అనారోగ్య కారణంతో డీకే శివకుమార్ ఢిల్లీ వెళ్లకుండా ఉండిపోయారు. ఈ ఉదయం ఆయన హస్తినకు బయల్దేరారు. మధ్యాహ్నం తర్వాత ఇరువురు నేతలతో మాట్లాడి సీఎం పదవిపై క్లారిటీ ఇచ్చేయనుంది. ఇద్దరూ కలిసి కర్ణాటకలో పార్టీని బలోపేతం చేయాలని హితబోధ చేయనుంది. కర్ణాటక మరో రాజస్థాన్ కాకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది కాంగ్రెస్. అందుకే ఇద్దరికీ అంగీకారమైన ఫార్ములాతో సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టాలని భావిస్తోంది. కర్ణాటక ఎన్నికల్లో విజయంతో మంచి జోరు మీద ఉన్న కాంగ్రెస్ మరింతగా దూసుకెళ్లాలని యోచిస్తోంది. అందుకే డీకే శివకుమార్ లాంటి వ్యూహాత్మక నేతలు అవసరమని భావిస్తోంది. 2024 ఎన్నికలపై దృష్టి పెట్టాలని ఇద్దరికీ సూచించే ఛాన్స్ ఉంది. వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి కర్ణాటకలోని ఎంపీ స్థానాలన్నింటినీ గెలుచుకునేలా వ్యూహాన్ని రెడీ చేయాలని ఇద్దరికీ చెప్పనుంది. ఇద్దరూ కలిసికట్టుగా పార్టీ విజయానికి శ్రమించాలని హితబోధన చేయనుంది. దీన్ని చెప్పడానికే డీకేను ఢిల్లీకి పిలిపిస్తున్నారనే వాదన బలంగా వినిపిస్తోంది.

### కేసులే డీకేకు మైనస్

అధిష్ఠానానికి అత్యంత సన్నిహితుడిగా డీకే శివకుమార్‌కు మంచి మార్కులే ఉన్నప్పటికీ ఆయనపై ఉన్న కేసులు పెద్ద మైనస్ అవుతున్నాయి. పార్టీ విజయానికి చాలా కష్టపడినా వాటిని కారణంగా చూపుతున్న అధిష్ఠానం ఆయనకు సీఎంగా చేయడానికి వెనుకాడుతోంది. ఆయన్ని సీఎంగా చేస్తే కేంద్రం మరిన్ని ఇబ్బందులు పాల్జేసి కర్ణాటకలో మళ్లీ ఏదైనా సమస్య తీసుకొస్తుందని కాంగ్రెస్ వాదిస్తోంది. అందుకే ఈ పరిస్థితిలో సిద్దరామయ్య లాంటి వారే కరెక్ట్‌గా హ్యాండిల్ చేయగలరని భావిస్తోంది. సిద్ధరామయ్యకు సీఎంగా ఓకే చెప్పిన తర్వాత ఆయన మంత్రివర్గంలో డీకే శివ కుమార్‌కు, ఆయన వర్గానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తోంది కాంగ్రెస్. ఆయన్ని ఉప ముఖ్యమంత్రిగా చేసే ఛాన్స్ కూడా ఉందంటున్నారు. ఈయనతో పాటు పార్టీ విజయానికి కారణమైన మరికొన్ని వర్గాలకి కూడా డిప్యూటీ సీఎం పదవులు కట్టబెట్ట బోతున్నారని తెలుస్తోంది.

# కొత్త పార్లమెంట్ ప్రారంభానికి సర్వం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించనున్నారు. కొత్త పార్లమెంట్ భవనాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం మే చివరి వారంలో జరగవచ్చు సమాచారం.కొత్త పార్లమెంట్ హౌస్ నిర్మాణం పూర్తి అయ్యింది. భవన నిర్మాణ బాధ్యతలు చూస్తున్న కేంద్ర గృహ నిర్మాణ శాఖ త్రిభుజాకారంలో ఉన్న ఈ నిర్మాణం జరిగింది. ఈ పార్లమెంట్ హౌస్ నాలుగు అంతస్తులతో ఉంటుంది. ఇందులో 1224 మంది ఎంపీలకు సీటింగ్ ఏర్పాట్లు చేశారు. గతంలో కంటే భద్రతా వ్యవస్థను మరింత పటిష్టం చేయనున్నారు.సువిశాలమైన కొత్త పార్లమెంటు భవనంలో అనేక ఆధునిక సౌకర్యాలు, ఫీచర్లు ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. ఇందులో పెద్ద పెద్ద హాళ్లు, సీటింగ్ లాంజెస్.. ఇలా ప్రతిదీ సరి కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందింది. జాతీయ పుష్పం ఆకృతిలో రూపొందించిన రాజ్యసభ హాలు.. 384 సీట్ల సామర్థ్యాన్ని కలిగి ఉంది. పార్లమెంట్ సజావుగా సాగేందుకు కొత్త, పాత భవనాలు సమిష్టిగా పనిచేస్తాయని చెబుతోంది కేంద్ర ప్రభుత్వం. కొత్త పార్లమెంట్ భవనంలోని అత్యాధునిక రాజ్యాంగ హాల్, హై టెక్నాలజీతో రూపొందించిన ఇతర కార్యాలయాలు అద్భుతంగా కనిపిస్తున్నాయి. సెంట్రల్ విస్టా రీడెవలప్‌మెంట్‌లో భాగమైన.. ఈ భవనాన్ని టాటా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ నిర్మిస్తోంది. ఇందులో పెద్ద హాళ్లు, లైబ్రరీ, విశాలమైన పార్కింగ్ స్థలంతో పాటు కమిటీ గదులు కూడా ఎన్నో హంగులతో రూపుదిద్దుకున్నాయి. చూపరులను విశేషంగా ఆకర్షిస్తున్న పార్లమెంట్ న్యూ బిల్డింగ్ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. కొత్త పార్లమెంటు ప్రారంభం ఎప్పుడెప్పుడా అన్న ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. మార్చి చివరి వారంలో కొత్త పార్లమెంటు భవనాన్ని ప్రధాని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత అధికారుల నుంచి సమగ్ర సమాచారం తీసుకున్నారు. దాదాపు గంటపాటు ఆయన పార్లమెంటులో గడిపారు. అలాగే పని చేస్తున్న కార్మికులతో మాట్లాడారు.

# హాజరు కాలేను-గడువు ఇవ్వండి

(మొదటిపేజీ తరువాయి)

మరో నాలుగు రోజుల సమయం కావాలని అడిగారు. ముందుగా నిర్ణయించిన పార్టీ కార్యక్రమాలు ఉన్నందున రాలేనంటున్నారు. ఇలా సీబీఐ నోటీసులు ఇచ్చిన తర్వాత విచారణ కు హాజరు కాకపోవడం ఇదే మొదటి సారి కాదు. దాదాపుగా ప్రతీ సారి ఇదే సమాధానం ఇచ్చారు. కొన్ని సార్లు కోర్టులకు వెళ్లారు. ఈ కారణంగానే అవినాష్ రెడ్డి విచారణకు సహకరించడం లేదని సీబీఐ కోర్టుకు కూడా చెప్పింది.అరెస్టులకు ఎలాంటి ఆటంకాలు లేకపోయినప్పటికీ సీబీఐ ఇంకా .. అవినాష్ రెడ్డి విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. వైఎస్ వివేకా హత్య కేసులో సీబీఐ ఎంపీ అవినాష్ రెడ్డి పాత్ర పై ముందస్తు బెయిల్ పిటిషన్ పై విచారణ సందర్భంగా కోర్టు దృష్టికి కీలక అంశాలు తీసుకెళ్లింది. వివేకా హత్య కేసు వెనుక జరిగిన కుట్రలో ఇంకా ఎవరైనా ఉన్నారేమో ఆయన ద్వారా తెలుసుకోవాల్సి ఉందని పేర్కొంది. అవినాష్ పాత్రపైన ప్రత్యక్ష సాక్షుల ద్వారా తెలిసిందని వివరించింది. గుండెపోటు అంటూ హత్యను దాచిపెట్టటం, సాక్ష్యాల విధ్వంసం, కుట్రలో అవినాష్ భాగమైనట్లు తేలినప్పటికీ సమాధానాలు ఎగవేసి, తప్పుదోవ పట్టించారని వివరించింది. దీంతో కస్టోడియల్ విచారణ అవసరమని కోర్టుకు నివేదించింది. హత్యకు వినియోగించిన గొడ్డలి ఎక్కడ ఉందన్నది కస్టడీ లో తెలుసుకోవాల్సి ఉందని పేర్కొంది, హత్య తరువాత 2019 మార్చి 15వ తేదీ తెల్లవారు జామున 1.58 గంటలకు అవినాష్ ఇంట్లో సునీల్ యాదవ్ ఉన్నట్లు గుగూల్ టేక్ ఔట్ ద్వారా తేలిందని సీబీఐ కోర్టుకు వివరించింది. అవినాశ్ రెడ్డి పాత్రపై స్పష్టమైన ఆధారాలున్నాయని... ఆయనకు ముందస్తు బెయిల్ ఇవ్వరాదని సీబీఐ పేర్కొంది. అందుకే విచారణకు హాజరైతే అరెస్ట్ చేస్తారేమోనని అవినాష్ రెడ్డి భావిస్తున్నట్లుగా చెబుతున్నారు. ఇప్పటికి ఆరు సార్లు ఎంపీ అవినాష్ సీబీఐ ముందు హాజరయ్యారు. ఇప్పుడు ఏడో సారి హాజరు కావాల్సి ఉంది.

# జనరిక్ మందులే వాడాలి

(మొదటిపేజీ తరువాయి)

మందులను రోగులకు రాస్తున్నారన్న విషయం తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఇక ముందు అలా ప్రముఖ బ్రాండ్లకు చెందిన మందులను రాసే డాక్టర్లపై ఉన్నతాధికారుల నిఘా ఉంటుందన్న విషయం మరవొద్దని తన ఆదేశాల్లో హెచ్చరించారు. తమ ఆధ్వర్యంలోని వైద్యులు జనరిక్ మందులనే రోగులకు సిఫార్సు చేసేలా చూడాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉందని అతుల్ గోయల్ సూచించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు ఉల్లంఘించిన వైద్యులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గతంలో మాదిరిగా ప్రైవేట్ మందుల కంపెనీల రిప్రజెంటేటివ్ లు ప్రభుత్వ ఆస్పత్రులకు పెద్ద సంఖ్యలో వచ్చే సంప్రదాయానికి స్వస్తి పలకాలని చెప్పారు. పరిమిత సంఖ్యలో మాత్రమే వారికి అనుమతి ఇవ్వాలని, కొత్తగా తయారైన మందుల గురించిన సమాచారాన్ని వైద్యులకు ఈ-మెయిళ్ల ద్వారా మాత్రమే వివరించాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ అతుల్ గోయల్ సూచించారు. ఒక కొత్త మందును కనుగొనడానికి ఫార్మా కంపెనీలు చాలా పరిశోధనలు చేస్తాయి. కొన్నేళ్ల పాటూ క్లినికల్ ట్రయల్స్ నిర్వహిస్తాయి. అన్ని పరీక్షలు పూర్తయ్యాక వాటిని మార్కెట్లోకి ప్రవేశపెడతాయి. అవే బ్రాండెడ్ మందులు. ఆ మందు తయారీపై, ఆ ఫార్మా కంపెనీకి ఇరవై ఏళ్ల పాటూ పేటెంట్ హక్కులు ఉంటాయి. ఆ సమయంలో వేరే వాళ్లు ఆ మందును అదే ఫార్ములాతో తయారు చేయకూడదు. ఆ మందు తయారీలో చాలా ఖర్చు పెట్టామని సదరు కంపెనీ వాదిస్తుంది. ఆ సొమ్మును రాబట్టుకోవాలంటే ఆ మందును తాము మాత్రమే అమ్మాలని భావిస్తుంది. అందుకే ప్రభుత్వాలు కూడా పేటెంట్ పేరుతో ఆ హక్కును సదరు కంపెనీకి ఇస్తాయి.ఇరవై ఏళ్ల తరువాత అదే ఫార్ములాతో ఎవరైనా ఆ మందును తయారు చేయవచ్చు. అలా అదే ఫార్ములాతో మందులు తయారుచేసి తక్కువ రేటుకే జనరిక్ మందుల షాపుల్లో అమ్ముతారు. కాకపోతే దీనిపై ఎలాంటి బ్రాండ్ నేమ్ ఉండదు. ఇలా వేరే ఫార్మా సంస్థల ఫార్ములాతో మందును తయారు చేసి తక్కువ రేటుకే పేదల కోసం అమ్మే వాటిని జనరిక్ మందులు అంటారు. వీటిని కేవలం జనరిక్ మందుల షాపుల్లోనే అమ్ముతారు.

# ఇవాళే గులాబీ కీలక సమావేశం

(మొదటిపేజీ తరువాయి)

నుంచి కమిషన్లకు తీసుకుంటున్నారని వారి చిట్టా తన దగ్గర ఉందని మండిపడ్డారు. అదంతా బయటకు రావడంతోనే సంచలనం అయింది. ఇప్పుడు అలాంటి ఎమ్మెల్యేల పేర్లుబయట పెట్టి.. ఇక టిక్కెట్ లేదని చెబుతారేమోనన్న అభిప్రాయం వినిపిస్తోంది. కేసీఆర్ పార్టీ అభ్యర్థులను కొంత కాలంగా ఖరారు చేస్తున్నారు. అనధికారికంగా వారికి సమాచారం ఇచ్చి.. పని చేసుకోమని చెబుతున్నారు. ఇప్పుడు ఆ అభ్యర్థులందరి?కీ క్లారిటీ ఇచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇప్పటికే కొంత మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టిక్కెట్లు ఇవ్వడం లేదన్న సమాచరం పంపారని అంటున్నారు. వచ్చే ఆరు నెలల పాటు ప్రజల్లో ఉండేలా ప్రత్యేకమైన కార్యక్రమాలకు కేసీఆర్ రూపకల్పన చేశారని.. వాటిని ఇంప్లిమెంట్ చేసేలా.. అందరికీ సూచనలు, సలహాలు, ఆదేశాలు ఇస్తారని భావిస్తున్నారు. కేసీఆర్ పక్కాగా ఎన్నికలకు రెడీ అవుతున్నారు.గతంలో ముందస్తు ఎన్నికలకు వెళ్లినప్పుడు ఎంత పక్కాగా .. అన్ని సిద్ధం చేసుకుని ఎన్నికలకు వెళ్లారో అలాంటి ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే ఎమ్మెల్యేలు, అభ్యర్థుల విషయంలో మాత్రం ఈ సారి మరింత సహకారం అవసరం ఉంది. గతంలో సిట్టింగ్ ఎమ్మెల్యేలను ఇద్దరు, ముగ్గుర్ని తప్ప మార్చలేదు. కానీ ఆ సిరి మాత్రం భారీగా మార్చే అవకాశాలు ఉన్నాయి.

# మళ్లీ మూడు పార్టీల ముచ్చట

**విజయవాడ :**



పవన్ కల్యాణ్ స్పీచ్‌లో ఆంధ్రప్రదేశ్ రాజకీయం మరో టర్న్ తీసుకుంది. బీజేపీ, టీడీపీ, జనసేన మధ్య పొత్తు ఉంటుందని ఆయన చెప్పడం సంచలనంగా మారింది. రాష్ట్రంలో మరింత బలపడాలని బీజేపీ, జనసేన వ్యూహాలు రచిస్తున్న టైంలో కాంబినేషన్ ఎలా సెట్ అవుతుందనే చర్చ ఇప్పుడు మొదలైంది. దానికి టు ప్లస్ టు ప్లస్ వన్ ఫార్ములా తెరపైకి తీసుకొస్తున్నారు కొందరు విశ్లేషకులు. 2014లో ఈ కాంబినేషన్ పొలిటికల్ తెరపై కనిపించినా... అప్పటికి జనసేన పోటీ లేదు. బీజేపీ నామమాత్రంగా ఉండేది. అందుకే కలిసి పోటీ చేయడం చాలా ఈజీ అయ్యింది. ఇప్పుడు పరిస్థితి పూర్తి భిన్నం. కేంద్రంలో అధికారంలో ఉన్నందున ఆంధ్రప్రదేశ్‌లో కచ్చితంగా ఒంటరిగా ఎదగాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. తనకున్న ఫ్యాన్ బేస్, ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకొని బలమైన పార్టీగా నిలబడాలని శ్రమిస్తున్నారు పవన్ కల్యాణ్. అందుకే ఈసారి సీట్ల పంచాయితీ, పొత్తుల పితలాటకం మామూలుగా ఉండబోదనే విశ్లేషణలు బలంగానే వినిపిస్తున్నాయి. ఈ చిక్కు ముడిని మూడు పార్టీల అధినాయకత్వం ఎలా విప్పుతుందనే డిస్కషన్ పొలిటికల్ సర్కిల్‌లో జోరుగా సాగుతోంది. జనసేన అధినేత పవన్ మంగళగిరి పార్టీ కార్యాలయంలో మండల, కమిటి సమావేశాల్లో చేసిన ప్రసంగం ఈ చర్చకు దారి తీసింది. జనసేన, తెలుగు దేశం, భారతీయ జనతా పార్టీ వచ్చే ఎన్నికల్లో కూటమిగా పని చేస్తాయని స్పష్టం చేశారు. పొత్తు లెక్కలు పక్కాగా ఉంటాయని కూడా తేల్చేశారు. తెలుగు దేశం, భారతీయ జనతా పార్టీ నాయకులు ఈ విషయాన్ని వారే స్పష్టంగా తమ పార్టీ తరపున చెప్పాల్సి ఉంటుందని అన్నారు. దీనిపై అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ భగ్గుమంది. పవన్ టార్గెట్‌గా ఎన్ని కామెంట్స్ చేయాలో అన్నీ చేస్తోంది. విమర్శల డోస్‌ను కూడా పెంచింది. కేవలం పవన్ మాత్రమే పొత్తుల కోసం వెంపర్లాడుతున్నారని సెటైర్లు వేస్తోంది. టీడీపీ పంచన చేరేందుకు పవన్ ఆత్రుతగా ఉన్నారంటూ ఆరోపణలు గుప్పిస్తోంది.పొత్తుల వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పవన్ చేసిన కామెంట్స్ కీలకంగా మారాయి. ఇప్పటికే రాష్ట్రంలో ఎన్నికల హీట్ పెరిగిపోయింది. అటు అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, ఇటు ప్రతిపక్షాలు ఎన్నికల కోసం సిద్ధమవుతున్నాయి. ప్రతిపక్షం అయితే ఒక అడుగు ముందుకు వేసి ముందస్తు ఎన్నికలు ఉంటాయని ప్రచారం చేస్తోంది. ఎన్నికల ఊపు రావటంతో ప్రతిపక్షాలు ఎవరి ఎత్తుల్లో వారు బిజిగా ఉన్నారు. జనసేన పార్టీకి మొత్తం 175 నియోజకవర్గాల్లో పోటీ చేసే పరిస్థితి కనిపించం లేదు. అందుకే తెలుగుదేశం బలాన్ని వాడుకోవాలని చూస్తోంది. తెలుగు దేశం పార్టీ సింగల్‌గా వెళితే పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదు. కేంద్రంలో అధికారంలో బీజేపిని కలుపుకోవటం ద్వారా లబ్ధి పొందాలని టీడీపీ ప్లాన్ చేస్తోంది. అందుకే మూడు పార్టీలు కలసి లెక్కను పక్కా చేసుకోవాలని చూస్తున్నాయి. మూడు పార్టీలు ఒక్కటైతే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీపై ముప్పేట దాడి చేసేందుకు ఉపయోగపడుతుందని పవన్ ఉద్దేశంగా చెబుతున్నారు. ఈ కలయికకు కేంద్ర బిందువైన సీఎం పదవిపై ఎన్నికల తర్వాత నిర్ణయించుకోవచ్చని పవన్ చెబుతున్నారని జనసేన వాదన. అన్ని అనుకున్నట్లుగా సీట్లు మెజార్టి వస్తే మొదటి రెండు సంవత్సరాలు తెలుగు దేశం పార్టీ ముఖ్యమంత్రి సీట్ దక్కించుకుంటుంది. ఆ తరువాత రెండేళ్లు జనసేన పార్టీ, చివరి ఏడాది భారతీయ జనతా పార్టీకి షేర్ చేసేందుకు ప్లాన్ ఉందని ప్రచారం జరుగుతోంది. దీనికి టీడీపీ ఒప్పుకుంటుందా అనేది అనుమానంగానే ఉంది. పొత్తుల వ్యవహారంలో పవన్ చేసిన కామెంట్స్‌పై అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దుమ్మెత్తిపోస్తోంది. జనసేన పార్టీకి చెందిన క్యాడర్‌కు క్లారిటి ఇచ్చే క్రమంలో పవన్ పొత్తుల విషయాలపై ముచ్చటించారు. పార్టీ శ్రేణులు అధికార పార్టీకి చెందిన నేతల మైండ్ గేమ్‌లో చిక్కుకోకుండా జాగ్రత్త పడేందుకు ఈ వ్యాఖ్యలు చేశారని పార్టీ వర్గాలు అంటున్నాయి. మచిలీపట్టణంలో జరిగిన పార్టీ పదో ఆవిర్భావ సభలో కూడా పవన్ ఇలాంటి కామెంట్‌లనే చేశారు. పార్టీకి చెందిన నాయకులు,కార్యకర్తలు ప్రతిపక్ష పార్టి వేసే ట్రాప్‌లో పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయితే పొత్తులపై చేసిన వ్యాఖ్యలు మాత్రం రాజకీయంగా దుమారాన్నే రాజేశాయి. సొంత పార్టీకి చెందిన నాయకులను టార్గెట్‌గా చేసుకొని, వారిని అప్రమత్తం చేయటంతోపాటుగా క్లారిటిగా సంకేతాలు పంపాలనుకున్న పవన్ కు వాస్తవానికి వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి పీఠం దక్కించుకోవటం తెలుగు దేశం పార్టీకి చాలా అవసరం. అలాంటిది చంద్రబాబుకు లేని తొందర జనసేనకు ఎందుకు, పొత్తులపైనే పవన్ ఎందుకు ఆరాటపడుతున్నారంటే, దాని వెనుక కూడా చంద్రబాబే ఉన్నారన్నది వైఎస్ఆర్ కాంగ్రెస్ నేతల వాదన. సో పవన్ ముఖ్యమంత్రి కావటాని కన్నా ముందు చంద్రబాబు సీఎం సీట్‌ను అధిరోహించాలనే కుతూహలం ఎక్కువ ఉందని విమర్శిస్తోంది

# తలనొప్పిగా కళ్యాణదుర్గం రాజకీయాలు

**అనంతపురం:**

అనంతపూరం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గం టీడీపీలో గ్రూపు రాజకీయాలు పతాక స్థాయికి చేరాయి. యువగళం లోకేష్ పాదయాత్ర వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం రోజున పాదయాత్ర చేపట్టాలని టీడీపీ అధిష్టానం ఆయా నియోజకవర్గాల ఇంచార్జిలకు ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇందుకు పూర్తి విరుద్ధంగా కళ్యాణదుర్గం టీడీపీ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి పాదయాత్రలు చేపడుతున్నారు. దీంతో టీడీపీ అధిష్టానానికి పెద్ద తలనొప్పిగా మారే అవకాశం ఉంది. 2024 ఎన్నికలు సమీప ఇస్తున్న తరుణంలో కళ్యాణ దుర్గం టీడీపీ నేతలు గ్రూపు రాజకీయాలు చేయడం చంద్రబాబుకు తలనొప్పిగా మారుతుంది. కార్యకర్తలు కూడా ఎటువైపు వెళ్ళాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నట్లు తెలుస్తోంది. కళ్యాణ దుర్గం నియోజకవర్గ ఇంచార్జ్ ఉమామహేశ్వర్ నాయుడు వర్గం సెట్టూరు మండలం యాటికల్లు నుంచి పాదయాత్ర చేపడుతుంటే మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి వర్గీయులు పాపంపల్లి నుంచి పాదయాత్ర చేపడుతున్నారు. దీంతో టీడీపీ రెండు వర్గాలుగా విడిపోయి పాదయాత్ర చేపడుతుండడంతో సర్వత్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి.మూడు సంవత్సరాల నుంచి కళ్యాణదుర్గం నియోజకవర్గ టీడీపీలో ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఎవరికి వారే యమునా తీరే చందంగా గ్రూపు రాజకీయాలు చేస్తున్నారు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సీరియస్‌గా పట్టించుకోకపోవడంతో టీడీపీలో గ్రూపు రాజకీయాలు మితిమీరి పోతున్నాయని కార్యకర్తలు వాపోతున్నారు. ఈ సంఘీభావ పాదయాత్ర వల్ల టీడీపీ మైలేజ్ తగ్గే అవకాశం ఉందని పలువురు నాయకులు గుసగుసలాడుతున్నారు. నారా లోకేష్ అనంతపూర్ జిల్లాలో పాదయాత్ర చేపట్టిన సమయంలో కళ్యాణదుర్గం టీడీపీ గ్రూప్ రాజకీయాలు గురించి ఆయన దృష్టికి వెళ్లినట్లు తెలుస్తోంది. మరి ఈ పాదయాత్ర వల్ల టీడీపీ లాభమా నష్టమా అనేది చూడాల్సి ఉంది.

# 5 నెలల్లో 50వేల కేసులు

**హైదరాబాద్ :**



ట్రాఫిక్ చలాన్ల నుంచి తప్పించుకోవాలనే ఉద్దేశంతో కొందరు వాహనదారులు నెంబర్ ప్లేట్ ను ట్యాంపరింగ్ చేస్తుంటారు. ఒక నెంబర్ ను కనిపించకుండా చేయడం, నెంబర్ ప్లేట్ కు మాస్క్ పెట్టడం, ప్లేట్ ను పక్కకు వంచడం ఇలా రకరకాల ట్రిక్స్ ప్రదర్శిస్తుంటారు. నెంబర్ ప్లేట్ ట్యాంపరింగ్ పై దృష్టి పెట్టిన రాచకొండ ట్రాఫిక్ పోలీసులు... స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. నెంబర్ ప్లేట్ సరిగా లేకపోయిన, కనిపించకుండా వంచినా, అస్పష్ట నెంబర్ ప్లేట్ ఉన్నా కేంద్ర మోటారు వాహన చట్టం కింద కేసులు నమోదు చేస్తున్నారు ట్రాఫిక్ పోలీసులు. ఈ కేసుల్లో వాహనదారులు జైలుకు కూడా వెళ్లిన సందర్భాలు ఉన్నాయి. జనవరి నుంచి ఇప్పటి వరకు రాచకొండ కమిషనరేట్ పరిధిలో 49 వేలకు పైగా నెంబర్ ప్లేట్ ట్యాంపరింగ్ కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.నెంబర్ ప్లేట్ ట్యాంపరింగ్ తో తొలిసారి దొరికిన వాహనదారులు వెంటనే వాటిని సరిచేసుకోవాలని, లేకుంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రాచకొండ జాయింట్ సీపీ సత్యనారాయణ తెలిపారు. కొత్త వాహనాలకు 30 రోజుల్లోగా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని నెంబర్ పొందాలని సూచించారు. నెంబర్ ప్లేట్ ట్యాంపరింగ్ చేసి పలుమార్లు పట్టుబడిన ఆరుగురికి కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించిందన్నారు. కోర్టు వాహనదారులకు రూ.5 వేల వరకు జరిమానా, మూడు నుంచి ఐదు రోజుల వరకు జైలు శిక్ష కూడా విధించిందని తెలిపారు. నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే వారిపై కేసులు నమోదు చేసి ఛార్జ్ షీట్లు నమోదు చేస్తామని హెచ్చరించారు. కోట్లు పెట్టి కార్లు కొంటున్న కొందరు నేతలు ఫ్యాన్సీ నంబర్ల కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. ప్రభుత్వానికి రావాల్సిన రాబడికి గండికొడుతున్నారు. కొత్త వాహనానికి ఫ్యాన్సీ నెంబర్ కావాలంటే నిబంధన ప్రకారం ఆన్‌లైన్‌లో రూ.2 లక్షల ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఎక్కువ మంది ఒకే ఫ్యాన్సీ నెంబర్ కు పోటీ పడితే ఆ నెంబర్ ను ఈ-వేలం వేస్తారు. ఈ వేలంలో ఎక్కువ ధర కోట్ చేసిన వారికే ఆ నెంబర్ కేటాయిస్తారు. 9999 నెంబర్ ఈ -వేలంలో రూ.10 లక్షల వరకూ వెళ్లిన సందర్భాలు కూడా లేకపోలేదు. అయితే ఏపీలో కొందరు నేతలు ఈ-వేలం లేకుండా నంబరు తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఇటీవల ఓ వాహనానికి ఫ్యాన్సీ నెంబర్ వేలం లేకుండా ఇచ్చేందుకు కొందరు నేతలు తీవ్ర ప్రయత్నాలు చేయడం చర్చకు దారితీసింది. నెంబర్ కేటాయింపునకు రవాణా శాఖ అధికారులు ఫైల్ ను ప్రభుత్వానికి పంపగా ఆర్థిక శాఖ దానిని తిరస్కరించింది. ఆన్ లైన్ లో ఫ్యాన్సీ నెంబర్ వస్తే... అది ఎక్కువ సేపు ఆన్‌లైన్‌లో కనిపించకుండా అధికారులపై నేతలు ఒత్తిడి తెస్తున్నారు. అధికారులు సాఫ్ట్‌వేర్ ట్రిక్కులతో 5-10 నిమిషాలు మాత్రమే నెంబర్ కనిపించేలా చేస్తున్నారు. వేలంలో రావాల్సిన దానికంటే తక్కువ ఫీజుకే బ్లాక్ చేస్తున్నారు.

# చేతులు మాత్రమే కలుస్తున్నాయి

**నెల్లూరు :**

నెల్లూరోళ్ల రాజకీయం మామూలుగా ఉండదు. పైకి సైలెంట్ గానే ఉన్నా.. లోలోపల ఎవరి రాజకీయాలు వారివి. నిన్న మొన్నటి వరకు భాయీ భాయీ అంటూ తిరిగినోళ్లు ఈరోజు ఎడమొహం పెడమొహంగా ఉన్నారు. పైకి చేయీ చేయీ కలిపినా లోపల వారి ఎత్తులు, పైఎత్తులు అర్థం చేసుకోవడం కష్టం. తాజాగా నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్, ఆయన బాబాయ్ రూప్ కుమార్ యాదవ్ మధ్య రాజకీయం కూడా ఇలాగే మారింది. అనిల్ కుమార్ యాదవ్ రెండుసార్లు నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా గెలిచారు, జగన్ తొలి కేబినెట్ లో మంత్రిగానూ పనిచేశారు. ఆయన గెలుపుకి రూప్ కుమార్ సపోర్ట్ కూడా కీలకం. ఆ విషయం అనిల్ కి కూడా తెలుసు. క్షేత్ర స్థాయిలో కార్యకర్తలకు రూప్ కుమార్ అందుబాటులో ఉంటారు. అనిల్ షాడోగా ఆయన చాలా వ్యవహారాలు చక్కబెట్టారు. కానీ ఎక్కడో వ్యవహారం తేడా కొట్టింది. అనిల్, రూప్ మధ్య గొడవ ముదిరింది. ఎంతగా అంటే.. రూప్ కొత్త ఆఫీస్ కూడా కట్టుకుంటున్నారు. రూప్ వర్గం అనిల్ దగ్గరకు వెళ్లడంలేదు. అప్పట్లో పార్టీలోనే ఉన్న కోటంరెడ్డితో కూడా రూప్ సన్నిహితంగా ఉన్నారు కానీ, అనిల్ తో మాత్రం కలవలేదు. ఆ తర్వాత రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి పార్టీనుంచి బయటకు రావడంతో రూప్, అనిల్ వ్యవహారంలో స్తబ్ధత నెలకొంది. కొన్నాళ్లు రూప్ కుమార్ సైలెంట్ గా ఉన్నారు. ఇటీవల సీఎం జగన్ కావలి పర్యటన సందర్భంగా హెలిప్యాడ్ వద్ద అనిల్ కుమార్ యాదవ్, రూప్ కుమార్ యాదవ్ మధ్య సయోధ్య కుదర్చాలని చూశారు. ఇద్దరు చేతులు కలిపారు. అక్కడకు మీడియాకు అనుమతి లేకపోవడంతో ఆ ఫొటోలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. ఇంకేముంది ఇద్దరూ కలసిపోయారని అనుకున్నారంతా..?చేతులు కలిపాం కానీ, తమ మనసులు కలవలేదన్నట్టుగా అనిల్ స్టేట్ మెంట్లున్నాయి. జగన్ చెప్పారు కాబట్టి తాను చేతులు కలిపానని, కానీ ఆయనతో తాను కలిసే ప్రసక్తే లేదని అనిల్ అన్నట్టుగా ఆయన వర్గం చెబుతోంది. ఒకవేళ ఆ పరిస్థితే వస్తే రాజకీయాలు వదిలేస్తానని కూడా అని అన్నట్టు సమాచారం. ఈ ప్రచారం బయటకు వచ్చినా అనిల్ గ్రూప్ నుంచి ఎలాంటి స్పందన లేదు. అంటే కావాలనే అనిల్ వర్గం ఈ లీకుల్ని బయటకు పంపించినట్టు సమాచారం.ప్రస్తుతం నెల్లూరు టౌన్ లో అనిల్ వర్గం, రూప్ వర్గం రెండుగా విడిపోయాయి. నెల్లూరు నగర డిప్యూటీ మేయర్ గా ఉన్న రూప్ కుమార్ యాదవ్ కొంతమంది కార్పొరేటర్లను తనవైపు తిప్పుకున్నారు. వారంతా అనిల్ వ్యతిరేక వర్గంగా ముద్రపడిపోయింది. వచ్చే దఫా అనిల్ కి సిటీలో టికెట్ ఇస్తే పార్టీ గెలుపు కష్టం అనే సంకేతాలు అదిష్టానానికి పంపేందుకు వీరు ప్రయత్నిస్తున్నారు. అనిల్ కి టికెట్ రాకుండా అడ్డుకోడానికి పావులు కదుపుతున్నారు. మరోవైపు టీడీపీ నుంచి మాజీ మంత్రి నారాయణే నెల్లూరు సిటీలో పోటీకి దిగుతారని తెలుస్తోంది. ఈ దశలో గట్టి అభ్యర్థిని బరిలో నింపాలని వైసీపీ అధిష్టానం భావిస్తోంది. సొంత పార్టీలోనే అనిల్ కి కుంపటి ఎదురైతే.. అది కచ్చితంగా టికెట్ పై కూడా ప్రభావం చూపించే అవకాశాలున్నాయి. అన్ని విషయాలు తెలిసినా కూడా అనిల్ మాత్రం రూప్ తో కలిసేందుకు ఇష్టపడటంలేదు. దగ్గరి బంధువులైనా కూడా వీరిద్దరూ ఎడమొహం పెడమొహంగా ఉండటం, సీఎం జగన్ చెప్పిన తర్వాత కూడా సఖ్యత కుదరకపోవడంతో.. నెల్లూరు సిటీలో వచ్చేదఫా వైసీపీ గెలుపుపై అనుమానాలు బలపడుతున్నాయి.

# ప్రపంచానికి తెలంగాణ నీటి విజయాల పాఠాలు

**అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ నిర్వహిస్తున్న వరల్డ్ ఎన్విరాన్మెంటల్ అండ్ వాటర్ రిసోర్సెస్ కాంగ్రెస్ సదస్సులో ప్రసంగించనున్న కేటీఆర్**

**ఈనెల మూడవ వారం వరకు కొనసాగనున్న కేటీఆర్ పర్యటన**

**హైదరాబాద్**

ప్రపంచ వేదిక పైన తెలంగాణ సాధించిన జలవిజయాన్ని చాటేందుకు మంత్రి కే తారక రామారావు అమెరికా పర్యటనకు బయలుదేరి వెళ్లారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర రావు మార్గదర్శనంలో నిర్మాణమైన ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల ప్రాజెక్టు కాళేశ్వరం నిర్మాణం, ఇంటింటికి సురక్షిత మంచినీరు అందిస్తున్న మిషన్ భగీరథ ప్రాజెక్టుల నిర్మాణం, వాటి ఫలితాలను అమెరికాలోని నెవడారాష్ట్రం లోని హెండర్సన్ నగరంలో జరుగుతున్న అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ వరల్డ్ ఎన్విరాన్మెంటల్ అండ్ వాటర్ రిసోర్సెస్ కాంగ్రెస్ సదస్సులో ప్రారంభోపన్యాసం చేసేందుకు మంత్రి కేటీఆర్ అమెరికా వెళ్లారు. సాగునీటి రంగంలో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టులు, ప్రభుత్వ ప్రణాళికల గురించి 2017 లో అమెరికా శాక్రమెంటో వేదికగా జరిగిన యాఅఇ సదస్సులో మంత్రి కేటీఆర్ వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భారీ సాగునీటి ప్రాజెక్టుల ప్రణాళికలు, అందరికీ సురక్షిత తాగునీరు అందించే మిషన్ భగీరథ లాంటి బృహత్ పథకాల గురించి ఆ రోజు కేటీఆర్ వివరించినప్పుడు ఆశ్చర్యం వ్యక్తం చేసిన యాఅఇ, ఆ తర్వాత 2022 లో తెలంగాణలో పర్యటించింది. కాళేశ్వరం ప్రాజెక్టుని ప్రత్యేకంగా సందర్శించిన ఆ సంస్థ ప్రతినిధుల బృందం, తెలంగాణ సాగునీటి రంగం లో కాళేశ్వరం ప్రాజెక్టు ఓ గేమ్ ఛేంజర్ అని ప్రశంసలు అందించింది. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును స్వల్ప కాలంలోనే పూర్తి చేయడం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేసిన అమెరికన్ సివిల్ ఇంజనీర్స్ సొసైటీ సంస్థ, ఆ విజయగాథను, తెలంగాణ ప్రభుత్వ ఘనతను అమెరికాలో వివరించేందుకు రావాలని ప్రత్యేకంగా మంత్రి కేటీఆర్ కు ఆహ్వానం పంపించింది. అమెరికాలోని దాదాపు అన్ని ప్రాంతాల నుంచి హాజరయ్యే సివిల్ ఇంజనీర్ల సమక్షంలో మంత్రి కేటీఆర్, సాగునీటి రంగంలో తెలంగాణ సాధించిన విజయాలను వివరించనున్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు, దాని ద్వారా అందుతున్న ఫలాలు , ఇతర ప్రణాళికలను ఒక ప్రజెంటేషన్ రూపంలో అందించనున్నారు. కాళేశ్వరంతో పాటు మిషన్ భగీరథ ద్వారా ప్రతీ ఇంటికి నీళ్ళు అందించిన విధానం ఈ రెండు ప్రాజెక్టుల ద్వారా తెలంగాణ రాష్ట్రంలో వచ్చిన సామాజిక ఆర్థిక ప్రగతిని మంత్రి కేటీఆర్ వివరించనున్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో భానుడు ప్రతాపం

**హైదరాబాద్:**



తెలుగు రాష్ట్రాల్లో భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఉదయం 9 గంటల నుంచే ఎండ వేడిమిని తట్టుకోలేకపోతున్నారు ప్రజలు. అందులోనూ మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు అత్యవసరమైతే తప్ప.. బయటకు రాకపోవడం మంచిదని వాతావరణ శాఖ హెచ్చరించింది. మరికొన్ని రోజులు పరిస్థితి ఇలాగే ఉండనుంది. అకాల వర్షాలతో ఏప్రిల్ నెలలో ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదయ్యాయి. కానీ గత 10 రోజుల నుంచి పగటి ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో సగటున 41 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండగా, కొన్ని జిల్లాల్లో 45, 46 డిగ్రీలు నమోదు అవుతున్నాయి. ఈ ఏడాదిలో విజయవాడలో అత్యంత వేడిగా ఉన్న రోజుగా మే 15 నిలిచిందని ఏపీ వెదర్ మ్యాన్ తెలిపారు. విజయవాడ, చుట్టుపక్కల ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రత 45 డిగ్రీల నమోదైనట్లు వెల్లడించారు. ప్రకాశం జిల్లా తర్లపాడులో గరిష్టంగా 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత ఉంది. ఏలూరు, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాలు, నంద్యాల, విజయనగరం, పల్నాడు జిల్లాల్లోని కొన్ని పట్టణాలలో 45 నుంచి 46 డిగ్రీల ఉష్ణోగ్రతలతో ప్రజలు ఠారెత్తిపోతున్నారు. అత్యంత వేడి వాతావరణం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.ఏపీతో పాటు తెలంగాణలోనూ ఎండలకు ప్రజలు తట్టుకోలేక పోతున్నారు. తెలంగాణలో 42 డిగ్రీల నుంచి 45 డిగ్రీలమధ్య సగటు ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఆదివారం అత్యధికంగా మంచిర్యాల జిల్లా కొండపూర్‌లో 45.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. హైదరాబాద్ వాతావరణ శాఖ 18 జిల్లాలకు ఆరెంజ్ ప్రమాద హెచ్చరిక జారీ చేసింది. అంటే ఆ జిల్లాల్లో 45 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చని అంచనా వేస్తోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తోంది. హైదరాబాద్ లో 41 నుంచి 43 డిగ్రీల మధ్య గరిష్ట పగటి ఉష్ణోగ్రత నమోదు కానుంది. మంచిర్యాల, జగిత్యాల, కుమురం భీమ్, నిజామాబాద్, నల్గొండ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది వాతావరణ కేంద్రం. రంగారెడ్డి, జోగులాంబ గద్వాల జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నివారం గరిష్ఠంగా వీణవంక మండలంలో 45.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా, ఆదివారం 45.9 డిగ్రీలతో మంచిర్యాల జిల్లా కొండాపూర్ ఆ రికార్డు బ్రేక్ చేసింది.

ప్రజా తపన
prajathapana.com

## లోకేష్ కు మద్దతుగా టీడీపీ ర్యాలీ

**దర్శి**

నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర వంద రోజులు పూర్తయిన సందర్భంగా ప్రకాశం జిల్లా దర్శిలో టిడిపి శ్రేణులు భారీ ర్యాలీతో పాదయాత్ర చేపట్టి శుభాకాంక్షలు తెలిపారు. దర్శి మండలం శామంతిపూడి నుండి దర్శి లోని టిడిపి కార్యాలయం వరకు ఏడు కిలోమీటర్లు భారీ ర్యాలీతో పాదయాత్ర చేపట్టి నారా లోకేష్ కు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు మాట్లాడుతూ... రాష్ట్రంలో లోకేష్ యువగళం పాదయాత్రతో వైసిపికి భయం పట్టుకుందన్నారు... దోచుకోవడం దాచుకోవడం తప్ప సీఎం జగన్ కు ఏమీ తెలియదు అన్నారు.. నవరత్నాలంటూ మోసపూరిత వాగ్దానాలు చేస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారు.బీసీ ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు ఏమయ్యాయో చెప్పాలన్నారు.రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమన్నారు...కార్యక్రమంలో పార్లమెంటు అధ్యక్షులు నూకసాని బాలాజీ, చైర్మన్ పిచ్చయ్య టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

## ముగ్గురు చైన్ స్నాచర్స్ అరెస్ట్

**కాకినాడ**



పెద్దాపురంలో ముగ్గురు చైన్ స్నాచర్స్ ను పోలీసులు అరెస్ట్ చేసారు. నిందితునుంచి సుమారు 8 లక్షల విలువైన 151 గ్రాముల బంగారం ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. పెద్దాపురం డిఎస్పీ లతా కుమారి నిందితుల వివరాలును మీడియాకు వెల్లడించారు. చైన్ స్నాచర్లను పట్టుకోవడంలో కృషి చేసిన సీఐ అబ్దుల్ నబీ, ఎస్సై వి.సురేష్, క్రైమ్ సిబ్బందిని అభినందించారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

**ఆసిఫాబాద్**



ఆసిఫాబాద్ జిల్లా మండలము లోని ఇప్పలనావేగం సమీపంలో మంగళవారంరోడ్డు ప్రమాదం జరిగింది. ఈరోజు తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందారని స్థానికులు చెబుతున్నారు. మృతుని వివరాలతో పాటు రోడ్డు ప్రమాదానికి సంబంధించిన మరిన్ని పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


## మహిళల ఆర్థిక అభివృద్ధికి లయన్స్ విజన్ కృషి

**కాకినాడ**

మహిళల నే కేంద్ర బిందువుగా చేసుకుని పలు కార్యక్రమాలను లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ద్వారా నిర్వహిస్తున్నట్లు లయన్ శ్రీదేవి రెడ్డి పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో దీర్ఘకాలిక రోగులకు నిత్యవసర సరుకుల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు గాను కుట్టు శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తూ వందలాది మందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వృద్ధాశ్రమంలో ప్రతినెల 100 కేజీల బియ్యం ఇస్తున్నట్లు తెలిపారు. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న మహిళలకు ప్రతినెల నిత్యవసర వస్తువులు పంపిణీ చేస్తున్నట్లు శ్రీదేవి రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాణి, మీనాక్షి ,న్యాయవాది యనమల రామం ,అడబాల రత్న ప్రసాద్, కే. ముని రెడ్డి, రవిశంకర్ పట్నాయక్, రేలంగి బాపిరాజు, రాజా తదితరులు పాల్గొన్నారు

## రెండు కార్లు, కంటైనర్ ఢీ-ఇద్దరు మృతి

**కాకినాడ**



తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం యర్నగూడెం గ్రామంలో హైవే ఫ్లైఓవర్ దగ్గర యాక్సిడెంట్ జరిగింది. ఒక కారు టైర్ పంచర్ కావడంతో అదుపు తప్పింది. కుడి వైపుకి రావడంతో ముందు వెళుతున్న బొలెరో వాహనాన్ని ఢీకొంది. ఈ రెండు వాహనాలు అటుగా వస్తున్న కంటైనర్ లారీని బలంగా ఢీకొట్టాయి. ఘటనలో కారులో ఉన్న ముగ్గురిలో ఇద్దరు స్పాట్ లోని చనిపోయారు. మరో వ్యక్తి కి గాయాలు కావడంతో కొవ్వూరు గవర్నమెంట్ హాస్పిటల్ కి తరలించారు దీనిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

## దేశవ్యాప్తంగా పది లక్షల ఉద్యోగాలు ఇవ్వడం లక్ష్యం-కేంద్ర మంత్రి కిషోర్ కౌషల్

**విజయవాడ**

ఈరోజు 310 నియామక పత్రాలు విజయవాడలో ఇచ్చాను. దేశ వ్యాప్తంగా 10 లక్షల ఉద్యోగాలు ఇవ్వడం లక్ష్యమని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి కిషోర్ కౌషల్ అన్నారు. నియమితులైన వారికి నా శుభాకాంక్షలు. యువత మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల ను సేవించరాదు. కేంద్రం గృహ నిర్మాణానికి 1.5 లక్షలు ఒకొక్కరికి ఇస్తుంది. 20 లక్షల గృహాలు మంజూరు చేసామని మంత్రి వెల్లడించారు.

# విజయసాయిరెడ్డి వర్సెస్ సుబ్బారెడ్డి

**విశాఖపట్టణం:**

వైఎస్ఆర్‌సీపీలో నేతల మధ్య రాజకీయ పోరాటం హద్దులు దాటుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ ఆధిపత్య పోరాటం కారణంగా సీనియర్ నేత బాలినేని శ్రీనివాసరెడ్డి పార్టీ బాధ్యతలు వదులుకున్నారు. ఇప్పుడు విజయ సాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి మధ్య ఇలాంటి పరిస్థితులే ఏర్పడుతున్నాయని వైజాగ్‌లో కొద్ది రోజులుగా జరుగుతున్న పరిణామాలు వెల్లడిస్తున్నాయన్న అభిప్రాయం వినిపిస్తోంది. విశాఖలో పీవీ సురేష్ అనే కార్పొరేటర్ ను వైఎస్ఆర్‌సీపీ కార్పొరేటర్‌ను పార్టీ నుంచి బహిష్కరించారు. అలాగే దొడ్డి మురళి అనే మరో డివిజన్ అధ్యక్షుడికీ గుడ్ బై చెప్పింది. దీంతో విశాఖ వైసీపీలో కలకలం ప్రారంభమయింది. ఎందకంటే విర్దదరూ విజయసాయిరెడ్డికి అనుచరులు. గతంలో విజయసాయిరెడ్డికి విగ్రహం పెట్టి మరీ పాలాభిషేకం చేశారు దొడ్డి మురళి. వీరిద్దరూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని పార్టీ నుంచి బహిష్కరించారు. మూడు రోజుల కిందట విజయసాయిరెడ్డి అనుచరుల్ని పార్టీ పదవుల నుంచి తొలగించారు సుబ్బారెడ్డి. వెంటనే విజయసాయిరెవడ్డి పార్టీ అనుబంధ సంఘాల ఇంచార్జ్ హోదాలో మళ్లీ వారిని పార్టీ పదవుల్లో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇది కూడా వివాదాస్పదమవుతోంది. విశాఖకు విజయ సాయిరెడ్డి చాలా కాలం ఇంచార్జ్ గా ఉన్నారు. విజయసాయిరెడ్డికి సీఎం జగన్ ప్రాధాన్యం తగ్గించారు. ప్రస్తుతం విశాఖ వైసీపీ ఇంచార్జ్ గా వైవీ సుబ్బారెడ్డి ఉన్నారు. విజయసాయిరెడ్డి నియమించిన వారిని పార్టీ పదవుల నుంచి తొలగించారు. తాను నియమించారు. విశాఖపై పట్టు కోల్పోకూడదనుకుంటున్న విజయసాయిరెడ్డి వెంటనే పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షుని హోదాలో.. మళ్లీ విశాఖలో తన అనుచరుల్ని నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చేశారు. దీంతో వైవీ సుబ్బారెడ్డి కారాలు మిరియాలు నూరుతున్నారు. ఇద్దరూ పోటాపోటీగా చర్యలు తీసుకుంటూడటంతో వివాదం ముదిరిపోతోందని వైసీపీ నేతలు కంగారు పడుతున్నారు. విజయసాయిరెడ్డి ఇటీవల సైలెంట్ గా ఉంటున్నారు. ఢిల్లీలోనే ఎక్కువ ఉంటుంది. ఇటీవల బాలినేని రాజీనామా చేసిన మూడు జిల్లాల కోఆర్డినేటర్ పదవిని విజయ సాయికి ఇచ్చారన్న ప్రచారంఉంది. కానీ ఈ అంశంపై అధికారికంగా ప్రకటన లేదు. ఇలా బాధ్యతలిచ్చారని విజయసాయిరెడ్డి కూడా ప్రకటించలేదు. ఇప్పటికే వైవీ సుబ్బారెడ్డి, బాలినేని శ్రీనివాసరెడ్డి మధ్య జరిగిన పోరాటం కాస్తా అంతర్గత వివాదాలకు కారమం అయింది. ఇప్పుడు విశాఖ ఇష్యూ వైసీపీలో మరింత గందరగోళానికి కారణం అవుతోంది. హైకమాండ్ జోక్యం చేసుకుని ఇలాంటి వాటిని పరిష్కరించాలని వైసీపీ నేతలంటున్నారు.

# వార్డు పాలనలతో .. జనాల్లోకి...

**హైదరాబాద్ :**

మహానగరంలోనున్న 150 వార్డుల్లో వార్డుల వారీగా పరిపాలన, పౌరసేవల నిర్వహణను మెరుగుపరిచేందుకు వార్డు పరిపాలనపై జీహెచ్ఎంసీ ముందడుగులు వేస్తుంది. వార్డు ఆఫీసు ఏర్పాటుకు సంబంధించి ఆఫీసులు ఏర్పాటు చేయకముందే వార్డు ఆఫీసుల వారీగా 150 మంది శానిటరీ జవాన్లను వార్డు శానిటేషన్ ఆఫీసర్లుగా నియమిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. మరో వైపు శాశ్వత ప్రాతిపదికన వార్డు ఆఫీసుల ఏర్పాటు కోసం డిప్యూటీ కమిషనర్లు స్థలాలను గుర్తించటంలో నిమగ్నం కాగా, వార్డు ఆఫీసర్‌కు కిందిస్థాయి సిబ్బందిని నియమించటంలో ఉన్నతాధికారులు బిజీగా ఉన్నారు.వచ్చే నెల 2 రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున ఒక్క వార్డు ఆఫీసునైనా, పూర్తిస్థాయి సిబ్బందితో పరిపాలన మొదలయ్యేలా చర్యలు చేపట్టారు. వార్డు కమిటీలుగా వ్యవహరించనున్న కార్పొరేటర్‌కు వార్డు ఆఫీసులో ఎలాంటి హోదా కల్పించాలన్న విషయంపై ఇంకా కసరత్తు కొనసాగుతుంది. వార్డు శానిటేషన్ ఆఫీసర్లుగా నియమితులైన 150 మంది జవాన్లు కాకుండా, శానిటేషన్‌తో పాటు హెల్త్ తదితర వ్యవహారాలను చూసుకునేందుకు వార్డుకు మరో ప్రత్యేక ఆఫీసర్‌ను కూడా నియమించాలా? అన్నదానిపై తుది నిర్ణయం తీసుకోవల్సి ఉన్నట్లు సమాచారం. 150 మంది శానిటరీ జవాన్ల నియామకాలు కూడా ఇష్టారాజ్యంగా జరిగినట్లు, కనీసం తమ అభిప్రాయం తీసుకోకుండా నియమించాలని కొందరు జవాన్లు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. తమను శానిటేషన్ ఆఫీసర్లుగా నియమించటంపై చేసిన హడావుడి డిప్యూటేషన్ గడువు ముగిసినా, ఇంకా ఇక్కడే తిష్టవేసిన అధికారులను తమ మాతృశాఖకు పంపటంపై చూపాలని బదిలీ అయిన పలువురు జవాన్లు వాదిస్తున్నారు. ఈ నియామకాల్లో కూడా అధికారుల ఫేవర్‌గా ఉండే యూనియన్ నేతలుగా వ్యవహరిస్తున్న జవాన్లకు ఈ నియామకం నుంచి మినహాయింపు ఇచ్చారన్న వాదనలు సైతం ఉన్నాయి .ఇదిలా ఉండగా 150 మంది జవాన్లను వార్డు శానిటేషన్ ఆఫీసర్లుగా ఈ నెల 10న నియమించిన కమిషనర్ ఆ మరుసటి రోజు నుంచి 17 వరకు సెలవుల్లో వెళ్లటం కూడా చర్చనీయాంశంగా మారింది. తనకు ఇష్టం లేకపోయినా, అది నిబంధనలకు విరుద్దం గా ఉన్నా, సర్కారు ఒత్తిడితో గతంలో కొన్ని పనులు చేసిన కమిషనర్ ఆ తర్వాత కొన్ని రోజులు సెలవుల్లో వెళ్లిన సంద ర్భాలు మరికొన్ని ఉన్నాయిఇప్పటికే చాలా డివిజన్లలో జీహెచ్ఎంసీ వార్డు ఆఫీసులున్నా, కనీసం అవి ఎక్కడున్నాయన్న విషయం కార్పొరేటర్లకు తెలియదు. దీనికి తోడు సర్కిల్ స్థాయిలో పనిచేసే డిప్యూటీ కమిషనర్లు, మెడికల్ ఆఫీసర్లు, ఇంజినీర్లతో వీరికి సమన్వయం అంతంత మాత్రమే. ఈ క్రమంలో సర్కిల్ పాలనకు సమాంతరంగా మరో వ్యవస్థ రావటంతో ప్రజాపతినిధులు, అధికారుల మధ్య సమన్వయం కుదురుతుందా? కనీసం పౌర సేవల నిర్వహణ మెరుగు పడుతుందా? లేక సర్కిల్‌స్థాయి వ్యవస్థగా వార్డు ఆఫీసు పాలన కూడా అవినీతికి మరో వేదికవుతుందా? వేచి చూడాలి.

## మే 31 నుండి జూన్ 4వ తేదీ వరకు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు

**తిరుపతి:**

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు మే 31 వ తేదీ నుండి జూన్ 4వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఘనంగా జరుగనున్నాయి. ప్రతిరోజు సాయంత్రం 6.30 గంటల నుండి రాత్రి 7.30 గంటల వరకు అమ్మవారు పద్మసరోవరంలో తెప్పలపై విహరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ ఉత్సవాల్లో శ్రీ అలమేలు మంగమ్మ పద్మసరోవర తీరంలో పాంచరాత్ర ఆగమపూజలు అందుకుని భక్తులను అనుగ్రహిస్తారు. ప్రతి సంవత్సరం అమ్మవారికి జ్యేష్ఠశుద్ధ ఏకాదశి నుండి పౌర్ణమి వరకు రమణీయంగా తెప్పోత్సవాలునిర్వహిస్తారు. తెప్పోత్సవాల్లో పాల్గొన్న భక్తులకు తిప్పలు, సంసార దుఃఖాలు తొలగి, మోక్షం సిద్ధిస్తుంది. పద్మసరస్సులో బంగారు పద్మం నుండి ఆవిర్భవించిన అలమేలు మంగ జీవకోటికి మాతృమూర్తిగా మారి భవజలధిలో మునిగిపోకుండా రక్షించి, సర్వసౌఖ్యాలు ప్రసాదిస్తారని తెప్పోత్సవాల అంతరార్థం.మే 31వ తేదీ మొదటి రోజు రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి, రెండో రోజు శ్రీ సుందరరాజస్వామి, చివరి మూడు రోజులు శ్రీ పద్మావతి అమ్మవారు తెప్పలపై విహరిస్తారు. చివరి మూడు రోజుల పాటు పద్మసరోవరంలోని నీరాడ మండపంలో మధ్యాహ్నం 3.30 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు అమ్మవారికి స్నపనతిరుమంజనం నిర్వహించనున్నారు. అమ్మవారికి జూన్ 3వ తేదీ రాత్రి 8 గంటలకు గజవాహనం, జూన్ 4వ తేదీ రాత్రి 8 గంటలకు గరుడ వాహనసేవ నిర్వహిస్తారు. తెప్పోత్సవం అనంతరం ప్రతిరోజు ఆలయ మాడ వీధుల్లో అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తారు.

**ఆర్జితసేవలు రద్దు :**

తెప్పోత్సవాల కారణంగా అమ్మవారి ఆలయంలో ఐదు రోజుల పాటు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవను రద్దు చేశారు.

ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజు ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కోలాటాలు నిర్వహించనున్నారు.

## పూర్తి స్థాయి అటవీ సంరక్షణ ప్రధాన అధికారిగా ఆర్.ఎం. డోబ్రియాల్

**హైదరాబాద్**



తెలంగాణ అటవీ సంరక్షణ ప్రధాన అధికారి& అటవీ దళాల అధిపతిగా రాకేష్ మోహన్ డోబ్రియాల్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత యేడాది ఫిబ్రవరిలో అప్పటి ప్రధాన అధికారి పదవీ విరమణ అనంతరం డోబ్రియాల్ కు పీసీసీఎఫ్ గా పూర్తి అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. తాజాగా పూర్తి స్థాయి అటవీ సంరక్షణ ప్రధాన అధికారిగా ఆయననే కొనసాగిస్తూ చీఫ్ సెక్రటరీ ఏ. శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం అరణ్య భవన్ లో ఆర్.ఏం. డోబ్రియాల్ బాధ్యతలు స్వీకరించారు.

తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర రావు, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్ర కరణ్ రెడ్డి లకు డోబ్రియాల్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యతకు అనుగుణంగా, హరిత తెలంగాణ సాధనకు అటవీశాఖ అధికారులు, సిబ్బంది పనిచేస్తామని అన్నారు.

## అంగన్వాడీలో బాలుడి మృతి

**కాకినాడ**

కాకినాడ జిల్లా కాజులూరు మండల పరిధిలోని గొల్లపాలెం సాయిబాబా కాలనీ వద్ద మంగళవారం అంగన్వాడీ కేంద్రంలో 9 ఏళ్ల బాలుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన సమాచారం ఇలా ఉంది.బరువు చూసుకునేందుకు బాలుడు ఉయ్యాల లాంటి తాడులో కూర్చొనగా ... అదికాస్తా మెడకు చుట్టుకోవడంతో ఊపిరాడక బాలుడు మృతి చెందినట్లు తెలిపారు.అయితే ఇంత జరిగినాఅంగన్వాడీ సిబ్బంది ఎక్కడా గొల్లపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.బాలుడు పేరు మనోజ్ ( 9) అంగన్వాడీ టీచర్ తలుపు దగ్గరగా వేసి, గర్భిణీలను పిలిచేందుకు వెళ్లే లోపు ఇద్దరు కుర్రాళ్ళు లోపలికి వెళ్ళి బరువు చూసుకుంటుండగా వేయింగ్ మిషన్ తాడు మెడకు చుట్టుకోవడంతో ఈ ప్రమాదం జరిగిందని గొల్లపాలెం ఎస్ ఐ తులసీరాం మీడియాకు తెలిపారు.ఈ ఘటన పోలీస్ స్టేషన్ కు కూత వేటు దూరంలో జరిగింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు భోరున విలపిస్తున్నారు.మృత దేహాన్ని పోస్ట్ మార్టం కు తీసుకెళ్ళొద్దంటు బంధువులు అంగన్వాడీ కేంద్రం వద్ద బైఠాయించారు.

## లారీ, డీసీఎం ఢీ..నలుగురు మృతి

**రంగారెడ్డి**

సిమెంట్ లోడ్ తో ఉన్న లారీ వేగంగా వస్తూ వెనక వైపు నుంచి డీసీఎం ను ఢీ కొట్టింది. రాచకొండ పోలీసు కమిషనరేటు అదిబట్ల పోలీసు స్టేషన్ పరిధిలోని సాగర్ రహదారి తుర్కయంజాల్ కూడలిలో అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో నలుగురు నాగసముద్రం సాయి రెడ్డి, తుమ్మోజు లక్ష్మయ్య, అహినల్ల మహేష్ కుమార్, వేంపల్లి మహేష్ మృతిచెందారు. లారీ డ్రైవర్ డ్రైవింగ్ చేసిన లారీని అజాగ్రత్తగా, నిర్లక్ష్యం తోలడంతో ఈ ఘటన జరినట్లు పోలీసులు తెలిపారు.

## భార్య కు కరెంట్ షాక్ పెట్టి ప్రాణాలు తీసిన భర్త

**రంగారెడ్డి**

రంగారెడ్డి జిల్లా కొందుర్గ్ మండల కేంద్రములో బార్య భర్త ల మధ్య నెలకొన్న తగాదాలు చివరికి బార్య ప్రాణాలు తీసే వరకు దారి తీశాయి. కోందుర్గ్ మండల కేంద్రానికి చెందిన యాదయ్య బార్య కవిత ను ఉదయం కరెంట్ షాక్ పెట్టి ప్రాణాలు తీశాడు. కవిత ఒంటిపై ఉన్న రక్త గాయాలు చూసి అనుమానంతో మృతురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త యాదయ్యాను అరెస్ట్ చేసిన పోలీసులు ఘటన పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## గాజుల రామారంలో కూల్చివేతలు

**కుత్బుల్లాపూర్**

స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ అర్విండ్ కుమార్ ఆదేశాలతో గాజులరామరంలోని ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమకట్టడాల కూల్చివేతలు మంగళవారం కొనసాగాయి. కుత్బుల్లాపూర్ రెవెన్యూ పరిదిలోని గాజులరామరం లో ఆర్.డి.ఓ మల్లయ్య ఆద్వర్యంలో భారీ కూల్చివేతలు జరిగాయి. గాజులరామరం, దేవేందర్ నగర్ లోని ప్రభుత్వ భూమి 342సర్వే నెంబర్ లో వెలిసిన అక్రమ కట్టడాలను 4 జెసిబిలతో కూల్చివేసారు. పోలీస్ ప్రొటెక్షన్ తో 4 జెసిబిలు,4 డిసియం లు, 2 వాటర్ ట్యాంకర్లు, గోనెసంచులతో భారీ స్థాయిలో కూల్చివేతలు జరిపారు.

## కార్పొరేట్ ఆసుపత్రికుల ధీటుగా బస్తీ దవాఖానలు

**హైదరాబాద్**

కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా బస్తీ దవాఖాన లలో సేవలు అందిస్తున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పేదల కోసం ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాల్లో అన్ని సదుపాయాలు అందిస్తున్నట్లు... రాష్ట్ర పశు సంవర్ధక తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గోషా మహల్ నియోజకవర్గ పరిధిలోని గన్ ఫౌండ్రి డివిజన్ లో గల నేతాజీ కమ్యూనిటీ హాల్ లో, జాంబాగ్ డివిజన్ లోని సుబాన్ పురా కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానను స్థానిక ఎమ్మెల్యే రాజాసింగ్ లతో కలిసి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. ఒకప్పుడు సర్కారు దవాఖాన కు పోవాలంటే ప్రజలు భయపడే వారని... కానీ ఇప్పుడు సర్కారు దవాఖానకు ప్రజలు క్యూ కడుతున్నారన్నారు. వేల రూపాయలు ఖర్చుతో కూడుకున్న టెస్టులను ఉచితంగా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యమే తమ ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. బస్తి దవాఖానలను ఏర్పాటు చేయడం వల్ల గాంధీ , ఉస్మానియా , నిలోఫర్ వంటి ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేషంట్ ల సంఖ్య తగ్గిందన్నారు. గ్రేటర్ హైదరాబాద్ లో ఇప్పటి వరకు 350 బస్తి దవాఖానలు ఏర్పాటు చేశామని... రానున్న రెండు మూడు రోజుల్లో మరో 14 ప్రారంభించనున్నట్లు తలసాని స్పష్టం చేశారు.

## కిలోన్నర అక్రమ బంగారం పట్టివేత

**రంగారెడ్డి**



శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో మరోసారి అక్రమ బంగారం రవాణా బయటపడింది. ఈ సారి అధికారులు కిలోన్నర బంగారం పట్టివేసారు. మస్కట్ నుండి హైదరాబాద్ వచ్చిన ఓ మహిళా ప్రయాణికురాలు నుండి 1476 గ్రాముల బంగారం కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బంగారాన్ని పేస్టు రూపంలో మార్చి సానిటరీ ప్యాడ్ లో అమర్చి తరలిస్తూ నిందితురాలు కస్టమ్స్ అధికారులకు దొరికిపోయింది. రూ 77.90 లక్షలకు పైగా విలువ చేసే బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కస్టమ్స్ అధికారులు వెల్లడించారు.

# నిర్మాణాత్మక ఎత్తుగడలకు దూరమేనా

**ఏలూరు:**

సినిమాల్లో పవర్ స్టార్ గా పేరు పొందిన పవన్ కళ్యాణ్ 'జనసేన పార్టీ పేరుతో సొంత పార్టీని స్థాపించి పదేళ్లు అయ్యింది. అయినా పవన్ కల్యాణ్ రాజకీయాల్లో సైడ్ క్యారెక్టర్ గానే ఉండిపోయారు. మూడు రోజుల క్రితం పవన్ కల్యాణ్.. పార్టీ నేతలో మాట్లాడుతూ.. సీఎం అయ్యే బలం ఇంకా రాలేదని ఒప్పుకున్నాడు. సీఎం వైఎస్ జగన్‌ను ఎదుర్కోవడానికి, ఒంటరిగా ఎన్నికలలో పోరాడటానికి తన పార్టీకి పూర్తి స్థాయిలో తగినంత శక్తి లేదన్నారు. మరో మాటలో చెప్పాలంటే తనను, తన పార్టీని ఒక బలీయమైన శక్తిగా నిరూపించుకోవడానికి ఏపీ ఓటర్లు తనకు అవకాశం ఇవ్వలేదని నిందించారు.సినిమాల్లో అత్యున్నత స్థాయికి చేరుకున్నప్పటికీ, అభిమానుల హృదయాలలో హీరో స్థానాన్ని ఆస్వాదిస్తున్నప్పటికీ, 14 సంవత్సరాల రాజకీయ జీవితంలో పవన్ ఇప్పటికీ "సైడ్ యాక్టర్", "సపోర్టింగ్ క్యారెక్టర్"గా ఉండటానికి సిద్ధమయ్యారు. సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉన్నప్పటికీ రాష్ట్రంలో ఏర్పడుతున్న రాజకీయ సమీకరణాల్లో తన ఉనికిని చాటుకోవడానికి జనసేన నిర్మాణాత్మక ఎత్తుగడలు వేయలేకపోతుంది. ఇప్పటికీ పవన్ పూర్తిస్థాయిలో బలపడలేదనడానికి ఇటీవల చేసిన ప్రకటనే నిదర్శనం. వైసీపీని ఒంటరిగా ఎదుర్కొనే శక్తి జనసేనకు లేదని, టీడీపీతో పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం ఉందని పవన్ తాజాగా అంగీకరించినట్లు ఆ మాటలతో తెలుస్తోంది.వైఎస్ జగన్ నిరంకుశ పాలన నుంచి ఏపీని కాపాడడమే తన లక్ష్యమని, ఆ లక్ష్యాన్ని సాధించేందుకు ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ–టీడీపీ –జనసేన కూటమిలో సహాయక పాత్ర పోషించేందుకు వెనుకాడబోనని పవన్ అంటున్నారు. మరో మాటలో చెప్పాలంటే దశాబ్దానికి పైగా రాజకీయాల్లో ఉన్న పవన్ జనసేనకు "జగన్ హఠావో- ఏపీ బచావో"అనే లక్ష్యం తప్ప, సమగ్ర ఎజెండా, విధానం లేదా విజన్ ఇంకా లేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. పవన్యయయ వైసీపీ "రాక్షస పాలన" బారి నుంచి ఏపీని విముక్తి చేయడానికి టీడీపీతో చేతులు కలపాలనే ఉద్దేశాన్ని వ్యక్తం చేస్తూనే తాను సీఎం పదవిని ఆశించలేనని స్పష్టం చేశారు.ప్రస్తుతం బీజేపీతో పొత్తులో ఉన్న పవన్ పార్టీ... వైఎస్ జగన్‌ను గద్దె దింపాలనే లక్ష్యంతో కాషాయ పార్టీని టీడీపీ కూటమిలో చేర్చేందుకు ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఆవిర్భవించేలా... టీడీపీని ఫినిష్ చేయాలనే ఇతర ఆలోచనలు ఉన్న బీజేపీ, టీడీపీతో చేతులు కలపడానికి విముఖంగా ఉంది. బీజేపీ పవన్ సూచనపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఏది ఏమైనప్పటికీ, కర్ణాటకలో ఫలితాల్లో ఎదురుదెబ్బ, టీడీపీ జెఎస్పీ కూటమిలో చేరడంపై బీజేపీ రెండో ఆలోచన చేస్తుందని విశ్లేషణలు వస్తున్నాయి. ఎందుకంటే బీజేపీకి ఇప్పుడు దక్షిణాది నుంచి కొత్త పొత్తులు అవసరం. అదే సమయంలో ఏపీలో ఒక్క లోక్ సభ సీటు కూడా సొంతంగా గెలుపొందే పరిస్థితి బీజేపీ లేదు. అదే సమయంలో వైఎస్సార్‌సీపీ బీజేపీతో డైరెక్ట్ పొత్తు పెట్టుకునే ఛాన్స్ లేదు. అనేక అంశాలలో కేంద్రంలోని బీజేపీ.. ఏపీ ప్రయోజనాల పట్ల ఉదాసీనత చూపుతున్నందుకు ఇప్పటికీ ఏపీ ఓటర్లు బీజేపీపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.కాబట్టి టీడీపీతో చేతులు కలపడానికి బీజేపీతో బంధాన్ని తెంచుకోవడానికి పవన్ కల్యాణ్ సిద్ధంగా ఉన్నారని సంకేతాలు ఇచ్చారు. దీంతో బీజేపీ జాతీయ నాయకత్వం డైలమాలో పడింది. అయితే వైసీపీ పవన్ టార్గెట్ చేసింది. టీడీపీ ప్రయోజనాలను నెరవేర్చేందుకే జనసేన రాజకీయాలు చేస్తుందని ఆరోపణలు చేస్తుంది. పవన్ రాజకీయాలు ..."జగన్‌ని తరిమికొట్టండి- చంద్రబాబును రక్షించండి" అనేలా ఉన్నాయన విశ్లేషకులు అంటున్నారు. రాజకీయాల్లోకి వచ్చిన 10 సంవత్సరాల తర్వాత కూడా తనను తాను సపోర్టింగ్ క్యారెక్టర్ స్టేటస్‌కు తగ్గించుకోవడం ఇంకా పవన్ రాజకీయాల్లో ఒనమాల స్టేజ్ లోనే ఉన్నారంటున్నారు కొందు.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతోందన్న భావన... పవన్ బలీయమైన శక్తిగా ఎదగడానికి ఛాన్స్ ఉన్నప్పటికీ ఆయన ఆ దిశగా ప్రయత్నాలు చేయడంలేదు. పవన్ మద్దతు కోసం టీడీపీ తహతహలాడుతుండడాన్ని కూడా పవన్ సరైన విధంగా వినియోగించుకోలేకపోతున్నారని విశ్లేషణలు వస్తున్నాయి. ఇంకా పవన్... చంద్రబాబు రాసిన స్క్రిప్ట్‌ను అనుసరిస్తూ... కన్ఫ్యూజన్ మోడ్‌లో ఉన్నారని విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటికైనా పవన్ రాజకీయంగా ఎదగడానికి సొంత స్క్రిప్ట్ రాసుకోవాలంటున్నారు.

# గొర్రెల పెంపకం దారుల అవగాహన సదస్సు

**రామడుగు**



రామడుగు మండలం రంగసాయి పల్లె గ్రామంలో రెండో విడత గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా ప్రాథమిక గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం లబ్ధిదారులకు అవగాహన సదస్సు రంగసాయి పల్లె రైతు వేదిక ప్రాంగణంలో మంగళవారం నిర్వహించామని మండల పశు వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారుడు తన వంతు వాటా 43,750 రూపాయలు చెల్లించి కావలసిన ధ్రువ పత్రాలు సంబంధిత పశువైద్యశాలలో అందించాలని డాక్టర్ అనిల్ కుమార్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రతి మండలానికి ఒక జిల్లా అధికారితో కూడిన టీం నియమించడం జరుగుతుందని పశు వైద్య అధికారులు ఎవరూ ఉండరని తెలిపారు. జిల్లా అధికారులతో కూడిన టీం లబ్ధిదారులను తమ వెంట తీసుకొని గొర్రెలు లభించు ప్రాంతాలకు తీసుకొని వెళ్లి లబ్ధిదారులకు నచ్చిన గొర్రెలు ఇప్పించడం జరుగుతుందని తెలిపారు. కరీంనగర్ జిల్లాకు గొర్రెలు కొనుటకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక మహారాష్ట్ర లు కేటాయించడం జరిగిందని పశు వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగసాయి పల్లె సర్పంచ్ సాదు పద్మ లింగారెడ్డి ప్రాథమిక గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం రామడుగు అధ్యక్షులు మ్యాకల చిన్న బీరయ్య మాజీ సర్పంచ్ కురుమ సంఘం నాయకుడు కోరే గట్టయ్య రామడుగు పశువైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ గుండి లైవ్ స్టాక్ అధికారి నునువాల గిరిధర్ పశువైద్య సిబ్బంది కురుమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సంపూర్ణ సుందరకాండ అఖండ పారాయణం

**తిరుపతి :**

తిరుమల ధర్మగిరి వేద పాఠశాలలో మంగళవారం ఉదయం 6 గంటలకు సంపూర్ణ సుందరకాండ అఖండ పారాయణం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో టిటిడి ఈవో ఏవి ధర్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపల్ కెఎస్ఎస్ అవధాని మాట్లాడుతూ, సర్వ మానవాళి శ్రేయస్సును కాంక్షిస్తూ టిటిడి సంపూర్ణ అఖండ సుందరకాండ పారాయణాన్ని చేపట్టిందన్నారు. "హనుమంతుడు సీతాదేవిని కలుసుకుని తిరిగి మహేంద్రగిరికి రావడానికి 16 గంటల సమయం పట్టిందని చెప్పారు. కాబట్టి సుందరకాండలోని 2,872 శ్లోకాలను 16 గంటల్లో పఠించడం ద్వారా మనం అన్ని సమస్యల నుండి, పాపాల నుండి విముక్తి పొందుతాము" అని ఆయన పేర్కొన్నారు. రుత్వికులు పారాయణంతో పాటు ఏకకాలంలో యాగం కూడా నిర్వహిస్తున్నట్లు వివరించారు.

వేదపండితుల మంత్రోచ్ఛారణ మధ్య దాదాపు 16 గంటల పాటు నిర్విరామంగా అఖండ పారాయణ యజ్ఞం కొనసాగనుంది. నాలుగు బృందాల్లో వేద పండితులు ఈ శ్లోకాలను ఒక బృందం తరువాత మరొక బృందంగా పఠించనున్నారు. మొదట సంక్షిప్త రామాయణం నుండి 100 శ్లోకాలు తరువాత సుందర కాండలోని శ్లోకాలు పారాయణం చేస్తున్నారు. ఒకవైపు శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారు, మరో వైపు శ్రీ సీతా లక్ష్మణ ఆంజనేయ సమేత రాముడు, మరో వైపు రుక్మిణీ సమేత శ్రీకృష్ణుని ఉత్సవమూర్తులు ఉండగా ధర్మగిరిలోని ప్రార్థనా మందిరాన్ని వివిధ దేవతామూర్తులతో అలంకరించారు. వివిధ చోట్ల ఆంజనేయుడి దివ్యరూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దేశం నలుమూలలతోపాటు విదేశాల నుండి సైతం భక్తులు ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం ద్వారా శ్లోక పారాయణంలో పాల్గొన్నారు. ఈ పారాయణ కార్యక్రమాని నిర్వహిస్తున్న టీటీడీకి భక్తులు అభినందనలు తెలియజేశారు. వేదపండితులు, భక్తులు చేసిన అఖండ సుందరకాండ పారాయణంతో ధర్మగిరి ప్రాంగణం మారుమోగింది. అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు శ్రీ రఘునాథ్ బృందం శ్రీ హనుమాన్ జై హనుమాన్ భజనతో కార్యక్రమం ప్రారంభమైంది.

ప్రముఖ పండితులు ఎస్వీ వేద విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ రాణిసదాశివమూర్తి, ఆగమ సలహాదారు మోహనరంగాచార్యులు, అన్నమాచార్య ప్రాజెక్ట్ డైరెక్టర్ విభీషణ శర్మ, ధర్మగిరి, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, ఎస్వీ ఉన్నత వేద అధ్యయనాలు తదితర వేద పండితులు, విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు. సీఈవో ఎస్వీబీసీ షణ్ముఖ్ కుమార్, ఎస్ఈ 2 జగదీశ్వర్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, వీజీఓ బాలిరెడ్డి, క్యాటరింగ్ స్పెషల్ ఆఫీసర్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.ఆకాశగంగ, జాపాలిలో ఆకట్టుకున్న ధార్మిక, భక్తి సంగీత కార్యక్రమాల హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా నాదనీరాజనం, ఆకాశగంగ, జపాలి తీర్థంలో నిర్వహిస్తున్న ధార్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

# కాంగ్రెస్ ను ముంచేస్తున్న సీనియర్లు

**న్యూఢిల్లీ :**

కాంగ్రెస్ గెలిచినా కష్టమే. అందుకే ఓడిపోయిన దానికంటే గెలిస్తేనే ఎక్కువ మధనపడుతుంటుంది ఆ పార్టీ హైకమాండ్. ముసిలి వాసనలు వదలని పార్టీ యువతరానికి అవకాశం ఇవ్వకపోవడంతోనే ఇలాంటి ఇబ్బందులు ఎదురవుతుంటాయి. కష్టం ఒకరిది.. సుఖం మరొకరిది అన్నట్లుగా కాంగ్రెస్‌లో ఉంటుంది. అందుకే వృద్ధతరం నేతలతో యువతరం నేతలు ఇప్పటికీ పార్టీలో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. కర్ణాటకలో గెలుపు అసాధారణం. ప్రజలు కూడా అదే స్థాయిలో తీర్పు ఇచ్చారు. మూడు దశాబ్దాల తర్వాత ముచ్చటైన తీర్పు ఇచ్చినా, ప్రజల తీర్పును పక్కన పెట్టి నాయకుడి ఎన్నికపై ఆ పార్టీ మల్లగుల్లాలు పడుతుంటే నవ్వాలో... ఏడవాలో తెలియని పరిస్థితి. వృద్ధతరం నేతల అనుభవం పార్టీకి అవసరం. వారి సీనియారిటీ, సిన్సియారిటీ కూడా విలువ ఇవ్వాలి. అంతే తప్ప వారిని అంతకు మించి ఆదరిస్తే అసలుకే ముప్పు వస్తుంది.ఇది ఒక కర్ణాటకకే కాదు. మధ్యప్రదేశ్, రాజస్థాన్ కూడా అంతే. రాజస్థాన్‌లో అప్పటి పీసీ?సీ ప్రెసిడెంట్ సచిన్ పైలట్ పడిన కష్టం, శ్రమ కారణంగానే పార్టీ అధికారంలోకి వచ్చింది. కానీ ముఖ్యమంత్రి పదవి వచ్చేసరికి ముసిలాయన అశోక్ గెహ్లాత్ తన్నుకు పోయారు. చివరకు ఏఐసీసీ అధ్యక్ష పదవి తీసుకోవాలని, చివరి ఏడాది అయినా సచిన్ పైలట్ కు అవకాశం ఇవ్వాలని చూసినా పెద్దాయన మాత్రం ససేమిరా అన్నారు. తనకు ముఖ్యమంత్రి పదవే ముద్దు అని తిష్ట వేసి మరీ కూర్చున్నారు. అశోక్ గెహ్లాత్ తో తెగేది కాదు. తెల్లారేదీ కాదు. ప్రజల్లోకి వెళ్లి పదహారు గంటలు ఓట్లు అడిగే పరిస్థితి కూడా లేదు. అయినా చివరి నిమిషం వరకూ కుర్చీని వీడేందుకు ఆయన అంగీకరించడం లేదు. హైకమాండ్ కూడా ఏమీ చేయలేక వదిలేసింది. రేపు మళ్లీ రాజస్థాన్ ఎన్నికలకు సచిన్ పైలట్ దిక్కవుతారన్న దానిలో సందేహం లేదు.ఇక మధ్యప్రదేశ్‌లోనూ అంతే. కమలనాథ్‌కు కాంగ్రెస్ పార్టీ ఏం తక్కువ చేసిందని? పదేళ్లు కేంద్రంలో అధికారంలో ఉంటే మంత్రి పదవి ఇచ్చింది. గౌరవిచ్చింది. కానీ మధ్యప్రదేశ్‌లో అధికారంలోకి రాగానే అక్కడ ముఖ్యమంత్రి పదవి ఆయనకే కావాలి. వయసు మీద పడుతున్నా, చేతులు వణుకుతున్నా సరే తాను ముఖ్యమంత్రి సీటులో కూర్చోవాల్సిందేనని భీష్మించుకుని కూర్చుకున్నారు. అనుభవజ్ఞుడే కావచ్చు. అధినాయకత్వానికి నమ్మకస్థుడే కావచ్చు. కానీ ఒక దశలో హైకమాండ్‌కు సహకరించాలి. కానీ మూతి ముడుచుకుని కూర్చుని ముసిలోడు పట్టుపట్టడంతో ఆయనకే సీఎం పదవి ఇవ్వాల్సి వచ్చింది. ఫలితంగా జ్యోతిరాదిత్య సింథియా బయటకు వెళ్లి పోవాల్సి వచ్చింది. ఇప్పుడు కర్ణాటకలోనూ అదే పరిస్థితి. డీకే శివకుమార్ నమ్మకమైన నేత. తనపై ఈడీ దాడులు చేసినా, కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థల చేత వేధింపులకు గురిచేసినా తట్టుకుని నిలబడ్డారు. సొంత నిధులను పార్టీ కోసం ఖర్చు పెట్టారు. శ్రమించారు. సిద్ధరామయ్య కష్టపడలేదని కాదు. ఆయన ఐదేళ్లు కర్ణాటకకు ముఖ్యమంత్రిగా చేశారు. ఆయన ఎప్పటికీ మాజీ ముఖ్యమంత్రిగానే ఉంటారు. కానీ డీకే కు అవకాశం ఇవ్వడానికి ఒప్పుకోవడం లేదు. తనకు ఇదే చివరి ఎన్నికలు అంటూ సిద్ధరామయ్య సెంటిమెంట్‌తో అధినాయకత్వాన్ని కొడుతున్నారు. ఇలా అయితే యువతరం, బలమైన నేతలు పార్టీని నమ్మి ఎందుకు బలంగా ఉన్న బీజేపీతో పెట్టుకుంటారు. కర్ణాటకలోనైనా హైకమాండ్ తన తీరు మార్చుకోవాలన్న సూచనలు వినపడుతున్నాయి. మరి మారితే అది కాంగ్రెస్ ఎందుకవుతుంది. కాంగ్రెస్ పార్టీకి ఎవరో శత్రువులు లేరు. ప్రజలు గెలిపించినా.. అధికారాన్ని నిలుపుకోలేక పోవడం దాని బలహీనత. అది అంతే. కాంగ్రెస్ అభిమానుల వేదన కూడా ఇదే.

# ఇందిరా పార్క్ లో దొంగలు పడ్డారు

**హైదరాబాద్**

నగరంలో ప్రసిద్ధిగాంచిన ఇందిరా పార్క్ లో గంధం చెట్ల ను దొంగిలించడానికి గుర్తుతెలియని దుండగులు విఫల యత్నం చేశారు. ఇటీవల ఇందిరాపార్క్ లో 10 గంధపు చెట్లను దొంగిలించిన నిందితులు పోలీసులకు చిక్కకముందే మరోసారి ఇందిరాపార్కు లో 8 చెట్లకు ఒక చెట్టు నరికి వేయడంతో పాటు 8 చెట్లకు ఘాట్లు పెట్టి వెళ్ళిపోయారు. మరుసటి రోజు ఈ చెట్లను దొంగలించడానికి ప్రయత్నించిన దుండగులకు ఉద్యానవన శాఖ అధికారులు చెక్ పెట్టి గంధం చెట్లను కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై ఇందిరా పార్క్ లో గంధం చెట్ల దొంగతనానికి విఫల యత్నం చేసిన దుండగులపై గాంధీనగర్ పోలీసులకు ఇందిరాపార్క్ మేనేజర్ భాస్కర్ గాంధీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం కాలుస్తున్నారు. ఇందిరా పార్క్ లో దాదాపు 8 గంధపు చెట్లకు ఘాట్లు పెట్టడంతో అవి చనిపోకుండా ఉండేందుకు ఉద్యానవన శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇందిరా పార్క్ లో పదేపదే గంధం చెట్ల దొంగతనం జరుగుతుందంటే సెక్యూరిటీ నిర్లక్ష్యం అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు ఇందిరాపార్క్ లో పునరావృతం అవుతున్నాయని వాకర్స్ సందర్శకులు ఆరోపిస్తున్నారు. వెంటనే ఇందిరాపార్క్ లో నిత్యం జరుగుతున్న గంధం చెట్లు దొంగతనాన్ని అరికట్టేందుకు ఉద్యానవన శాఖ అధికారులు సెక్యూరిటీ సిబ్బంది గాంధీనగర్ పోలీసులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# నకిలీ విత్తనాలపై ఉక్కు పాదం

**హైదరాబాద్**

వానాకాలం సాగుకు అందుబాటులో విత్తనాలు, విత్తన నియంత్రణ, నకిలీ విత్తనాలను అరికట్టేందుకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో డీజీపీ అంజనీ కుమార్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, హైదరాబాద్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సీవీ ఆనంద్ , సీఐడీ చీఫ్ మహేష్ భగవత్, సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, డీఐజీ షానవాజ్ ఖాసీం, డీఐజీ ఇంటలిజెన్స్ కార్తికేయ, వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ హన్మంత్ కొడిబ, ఉద్యాన శాఖ డైరెక్టర్ హన్మంతరావు, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి, సీడ్స్ ఎండీ కేశవులు, అడిషనల్ డీఏ విజయ్ కుమార్ , రిజిస్ట్రార్లు సుధీర్ కుమార్, భగవాన్ , అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, డీఎఓలు, అన్ని స్థాయిల వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మంత్రి మాట్లాడుతూ అక్షరాలా రూ.4.50 లక్షల కోట్లు 9 ఏళ్లలో వ్యవసాయరంగంపై తెలంగాణ ప్రభుత్వం చేసిన ఖర్చు. దేశంలోని మరే రాష్ట్రంలోనూ ఒక రంగం మీద ఇంత భారీగా ఏ ప్రభుత్వం ఖర్చు చేయలేదు. తెలంగాణలో వ్యవసాయానికే తొలిప్రాధాన్యం. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టి మూలంగా దేశంలో తెలంగాణ వ్యవసాయ రంగానికి ప్రత్యేక గుర్తింపు. వ్యవసాయ రంగం బలోపేతం మూలంగానే సర్వతోముఖాభివృద్ధి అన్నది కేసీఆర్ ఆలోచన అని అన్నారు.

వ్యవసాయ రంగం నుండి లభించే విస్తృతమైన ఉపాధి మరే రంగం కూడా ఇవ్వలేదు. ఆ ప్రాధాన్యతను గుర్తించే తెలంగాణ ప్రభుత్వం గత 9 ఏళ్లలో ఉచిత కరంటు, పంటల కొనుగోళ్లు, రైతుబంధు, రైతుభీమా, సాగునీరు, విత్తనాలు, ఎరువుల సబ్సిడీ, వ్యవసాయ యాంత్రీకరణ, పంటల మార్పిడి వంటి వాటికి తెలంగాణ ప్రభుత్వం రూ.4.50 లక్షల కోట్లు ఖర్చు చేసింది. దేశంలో మనకన్నా విస్తీర్ణంలో, జనాభాపరంగా పెద్దవైన రాష్ట్రాలు ఏవీ ఇంత ఖర్చు పెట్టలేదు. తెలంగాణ ప్రభుత్వ 9 ఏళ్ల కృషికి క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపిస్తున్నాయి. పల్లెసీమలు బాగుపడ్డాయి ప్రజల చేతికి పని వచ్చింది వ్యవసాయ ఉత్పత్తులు, ఉత్పాదకత పెరిగి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అయ్యిందని అన్నారు.



భిన్న వృత్తులు, ఉపాధులు బలపడి సమగ్రమైన అభివృద్ధి కళ్ల ముందు కనిపిస్తున్నది .. అన్నింటికీ వ్యవసాయమే మూలాధారం. వ్యవసాయం బాగుండాలంటే రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండాలి. కేంద్రంతో సమన్వయం చేసుకుని ఎరువులు అందుబాటులో ఉండేలా ప్రణాళికతో వ్యవహరిస్తున్నాం. ఈ వానాకాలానికి పత్తి, మిరప, కందులు, వరి మిగిలిన అన్ని రకాలు కలిపి 18 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరం అవుతాయని అంచనా వేసాం. పోటీ ప్రపంచంలో విత్తనాల తయారీలో ప్రైవేటు కంపెనీలదే పైచేయిగా ఉంది .. వాటిని నియంత్రించే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మీద ఉన్నది. నకిలీ విత్తనాల బెడద సంపూర్ణంగా నివారించబడాలి. నకిలీ విత్తనాలు సరఫరా చేసే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి .. గతంతో పోలిస్తే నకిలీ విత్తనాలు దాదాపు కనుమరుగయ్యాయి. ఈ విషయంలో టాస్క్ ఫోర్స్, వ్యవసాయ శాఖ సమన్వయంతో పనిచేయాలి. నకిలీ విత్తనాలను అరికట్టే ప్రయత్నంలో అమాయకులను బలిచేయవద్దు. ఈ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. కర్ణాటక, కర్నూలు, గద్వాల వైపు నుండి, గుంటూరు, ప్రకాశం వైపు నుండి, అసిఫాబాద్, బెల్లంపల్లి వైపు నుండి, గుజరాత్ వైపు నుండి జహీరాబాద్ మీదుగా వచ్చే దారులపై నిఘా ఉంచాలి. ప్రధానంగా గుజరాత్, ఆంధ్రాల నుండి నకిలీ విత్తనాల బెడద ఉన్నది .. గత కొన్నేళ్లుగా ఈ విషయం రుజువు చేస్తున్నది. హెచ్ టీ పత్తి విత్తనాల విషయంలో రైతులను చైతన్యం చేయాలి. క్షేత్రస్థాయిలో కనిపించే చిన్న, చిన్న లోపాలు, తప్పిదాలపై కఠినంగా వ్యవహరించకుండా ట్రేడర్లు, విత్తన వ్యాపారులకు సమయం ఇచ్చి సరిచేసుకునేందుకు అవకాశం ఇవ్వాలి. దేశంలో అవసరమైన 60 శాతం విత్తనాలను తెలంగాణ అందిస్తున్నది .. ఈ రంగానికి ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని వ్యవహరించాలని అన్నారు.

# కొడుకు మృతిని తట్టుకోలేక గుండెపోటుతో తల్లి మృతి

**కరీంనగర్**

కరీంనగర్ జిల్లాలో విషాదం నెలకొంది. భార్య మృతి తట్టుకోలేక భర్త, కొడుకు మృతిని తట్టుకోలేక తల్లి గుండెపోటుతో మరణించింది. ఈ ఘటన తిమ్మాపూర్ మండలం నేదునూరు గ్రామంలో చోటు చేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపూర్ మండలం నేదునూరు గ్రామానికి చెందిన శ్యాంసుందర్ 35 కు.. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ కు చెందిన శారదతో గత ఏడాది కిందట వివాహమైంది. అయితే కుటుంబ కలహాలతో గత ఏడు నెలల కిందట భార్య తన పుట్టినూరు అయిన హుస్నాబాద్ లో చెట్టు కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అప్పటి నుండి భర్త మనస్థాపానికి గురై.. భార్య మరణం జీర్ణించుకోలేకపోయాడు. నిన్న వారి పెళ్లి రోజు కావడంతో భార్య మరణించిన చోటునే పురుగుల మందు సేవించి శ్యాం సుందర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో నేదునూర్ గ్రామంలో శ్యాం సుందర్ అంత్యక్రియలు పూర్తి చేసుకున్న కొన్ని గంటల వ్యవధిలోనే కొడుకు మృతిని తట్టుకోలేక తల్లి గుండె పోటు తో ప్రాణాలు విడిచింది. దీంతో గ్రామంలో ఒక్కసారిగా విషాదం నెలకొంది.

# ఉగ్రవాదులకు లకు ప్రొఫెసర్ లింక్

**హైదరాబాద్ :**

హైదరాబాద్‌లో కలకలం రేపిన ఉగ్రవాదుల వ్యవహారంలో మతం మార్చుకున్న ప్రొఫెసర్ కీలకంగా వ్యవహరించినట్లు దర్యాప్తు బృందాలు గుర్తించాయి. హైదరాబాద్‌లో ఇతరుల్ని ఉగ్రవాదం వైపు ఆకర్షితులయ్యేలా చేయడంలో ప్రొఫెసర్ సలీం ముఖ్య పాత్ర పోషించినట్లు విచారణలో వెల్లడైంది. హైదరాబాద్‌లో వెలుగు చూసిన ఉగ్రవాదుల అరెస్ట్ వ్యవహారంలో పోలీసులు కీలక సమాచారాన్ని రాబట్టారు. ఉగ్రవాద నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడంలో ప్రొఫెసర్ సలీం కీలకంగా పనిచేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో పోలీసులు అదుపులోకి తీసుకున్న వారంతా సలీం ద్వారా నెట్‌వర్క్‌లో ప్రవేశించిన వారేనని గుర్తించారు. సలీం ఏడాది వ్యవధిలో నాలుగు ఇళ్లు మార్చినట్లు పోలీసులు గుర్తించారు. మధ్యప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్, హైదరాబాద్ పోలీసులు సంయుక్తంగా జరిపిన దాడుల్లో అరెస్టైన డెక్కన్ కాలేజీ ఫార్మాస్యూటికల్ బయోకెమిస్ట్రీ ప్రొఫెసర్ మహ్మద్ సలీం టెర్రర్ మాడ్యుల్‌లో కీలకంగా పనిచేసినట్లు గుర్తించారు. ఇతడే మిగిలిన వారిని ఉచ్చులోకి లాగినట్లు గుర్తించారు. భోపాల్‌లో చిక్కిన 11 మందితో పాటు నగరంలో అరెస్టు అయిన ఐదుగురినీ ఏటీఎస్ కస్టడీలోకి తీసుకుని విచారిస్తోంది. మహ్మద్ సలీంగా మారిన సౌరభ్ రాజ్ విద్య 2018లో తన భార్యతో కలిసి నగరానికి వచ్చాడు. తొలుత సైదాబాద్‌లో నివసించిన వీళ్లు అక్కడి ఓ పాఠశాలలో టీచర్లుగా పనిచేశారు. కేవలం ఉగ్రవాద కార్యకలాపాల కోసం మాడ్యుల్ తయారు చేయడానికే హైదరాబాద్ చేరుకున్నట్లు ఏటీఎస్ చెప్తోంది. సైదాబాద్ నుంచి సలీం తరచూ మలక్‌పేటలోని ప్రార్థన స్థలానికి వెళ్లేవాడు. అక్కడే ఇతడికి హాఫీజ్ బాబానగర్‌కు చెందిన మహ్మద్ అబ్బాస్ అలీతో పరిచయమైంది. కొన్నాళ్లకు ఇద్దరూ మంచి స్నేహితులుగా మారారు. పేదరికంలో ఉన్న అబ్బాస్‌ను తన దారిలోకి తెచ్చుకోవడానికి సలీం అతడి అవసరాలు తెలుసుకుని ఆటో ఖరీదు చేసి, తక్కువ రేటుకు అతడికి అద్దెకు ఇచ్చాడు. తన మీద ఆధారపడిన అబ్బాస్‌ను తన ఇంటికి పిలిచి రెచ్చగొట్టే వీడియోలు చూపించడం, ఆడియోలు వినిపించాడు. ఈ క్రమంలో సలీంతో కలిసి పనిచేయడానికి అబ్బాస్ అంగీకరించినట్లు పోలీసులు చెబుతున్నారు. నగరంలోని ఓ మల్టీ నేషనల్ కంపెనీలో క్లౌడ్ సర్వీస్ ఇంజనీర్‌గా పని చేస్తున్న అబ్దుల్ రెహ్మాన్‌తో పాటు అతని భార్య కూడా మతం మార్చుకుంది. రెహ్మాన్ ఒడిశా రాష్ట్రానికి చెందిన వాడు కాగా, అతడి భార్య మధ్యప్రదేశ్ చెందిన వారు. రెహ్మాన్ భార్యకు, సలీం భార్యకు భోపాల్ నుంచి పరిచయం ఉంది. రెహ్మాన్ తన భార్య ద్వారా సలీం భార్యకు, ఆమె ద్వారా సలీంకు పరిచయమయ్యాడు. తరచూ సలీం ఇంటికి వచ్చి వెళ్లే రెహ్మాన్ మెల్లగా అతడి ఉచ్చులో పడ్డాడని చెబుతున్నారు. గోల్కొండలో సలీంకు డెంటిస్ట్ షేక్ జునైద్‌తోపాటు దినసరి కూలీ మహ్మద్ హమీద్‌తో పరిచయమైంది. వీరినీ తన దారిలోకి తెచ్చుకున్న సలీం మరికొందరిని తన మాడ్యుల్‌లో చేర్చుకోవాలని భావించాడు. ఈ విషయాన్ని హమీద్‌కు చెప్పడంతో అతని ద్వారా చిన్ననాటి స్నేహితుడైన జవహర్‌నగర్‌కు చెందిన మహ్మద్ సల్మాన్‌ను పరిచయం చేశాడు. ఈ మాడ్యుల్‌కు ఇప్పటివరకు వేరే ఎవరి నుంచీ ఆర్థిక సాయం అందలేదని ఏటీఎస్ అధికారులు చెప్తున్నారు. ఇప్పటివరకు అయిన ఖర్చంతా సలీం, రెహ్మాన్, జునైద్ భరించారని ఏటీఎస్ గుర్తించింది. ఏడాది కాలంలో ఇతడు నాలుగు ఇళ్లు మారినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. సలీం సైదాబాద్ నుంచి అక్బర్‌బాగ్, అక్కడ నుంచి సీతాఫల్‌మండి.. ఆపై గోల్కొండ ప్రాంతానికి మకాం మార్చాడు. రెహ్మాన్, జునైద్ కూడా ఇతడి ప్రోద్బలంతోనే అక్కడే ఇళ్లు అద్దెకు తీసుకున్నారు.

# కమ్యూనిస్టులకు దూరమే....

**హైదరాబాద్ :**

భారత రాష్ట్ర సమితితో కలిసి పని చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని.. ఎన్నికల్లో పోటీ చేయకుండా ఉండటానికి తామేమీ సన్యాసం తీసుకోలేదని సీపీఐ అగ్రనేత నారాయణ స్పష్టం చేశారు. కేసీఆర్ నుంచి పొత్తులపై సానుకూల సంకేతాలు రాకపోతే ఒంటరిగా పోటీ చేస్తామని ప్రకటించారు. మునుగోడు ఉపఎన్నికల సమయంలో కేసీఆర్. .కమ్యూనిస్టులతో కలిసి రాష్ట్రంలోనే కాదు జాతీయ స్థాయిలోనూ కలిసి పని చేస్తామని ప్రకటించారు. కానీ ఇప్పుడు అనూహ్యంగా వెనక్కి తగ్గుతున్నారు. దీంతో జాతీయ రాజకీయాల విషయం లోనూ కేసీఆర్ వెనక్కి తగ్గుతున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత భారత రాష్ట్ర సమితి ఎప్పుడూ పొత్తుల గురించి ఆలోచిం చలేదు. మజ్లిస్ తెర వనుక నుంచి ఇచ్చే సహకారం చాలని.. అనుకుంటోంది. మజ్లిస్ సహకరిస్తూ వస్తోంది. అయితే టీఆర్ఎస్ ను బీఆర్ఎస్‌గా మార్చిన తర్వాతా జాతీయ రాజకీయాలను ప్రారంభించిన కేసీఆర్ కమ్యూనిస్టులను చేరదీశారు. వచ్చే ఎన్నికల్లోనూ కలిసి పనిచేద్దామని మునుగోడు ఉపఎన్నికల్లో వారి మద్దతు పొందారు. బీఆర్ఎస్ విజయంలో వారి ఓట్లు కీలకమయ్యాయని చెబుతూ ఉంటా?. కానీ ఇప్పుడు కేసీఆర్ ఆ లెఫ్ట్ పార్టీల గురించి మాట్లాడటం లేదు. కనీసం పిలిచి మాట్లాడటం లేదు. నిజం చెప్పాలంటే. ఇప్పుడు ఆయన జాతీయ రాజకీయాల గురించే మాట్లాడటం లేదు కాబట్టి.. లెఫ్ట్ పార్టీల నేతలకూ ఆహ్వానాలు లేకుండా పోయాయి. అందుకే సీపీఐ జాతీయ నేత నారాయణ.. కేసీఆర్ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. సరైన స్పందన రావడం లేదని.. అలాగని తామేమీ సన్యాసం తీసుకోలేదని ఎన్నికల్లో పోటీ చేసి తీరుతామంటున్నారు. అంటే టీఆర్ఎస్ పొత్తులు పెట్టుకుంటే సీట్లివ్వాలి కానీ ఇప్పుడు ఒక్క సీటు కూడా కేటాయించే అవకాశం లేదు. అలాంటి సూచనలు కూడా కేసీఆర్ ఇవ్వడం లేదని చెబుతున్నారు. ప్రతీ సారి మజ్లిస్ తో లోపాయికారీ పొత్తులు ఉంటాయి. ఈ సారి మజ్లిస్ నుంచి ఆ పార్టీకి అలాంటి సహకారం వస్తుందా లేదా అన్నది సందేహమే. పాతబస్తీలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల వరకూ ఢోకా లేదు. కానీ ఆ బయట కూడా సత్తా చూపించాలని ఉబలాటపడుతోంది. రెండు, మూడు అసెంబ్లీ సీట్లు ఇచ్చినా సంతృప్తి పడుతుంది. కానీ కేసీఆర్ పాతబస్తీ బయట మజ్లిస్ బలపడటానకి చాన్సిస్తారా అంటే.. అసలు చాన్స్ లేదన్న అభిప్రాయం వినిపిస్తోంది ఇక అడపా దడపా కాంగ్రెస్ పార్టీతో పొత్తుల గురించి చర్చల్లోకి వస్తుంది కానీ.. అది అసాధ్యమని రాజకీయ వర్గాలందరికీ తెలుసు. ఒక వేళ జాతీయ స్థాయి లో ఏదైనా రాజకీయం చేయాలనుకుంటే అక్కడ చేస్తారు కానీ.. గల్లీలో మాత్రం ఆ రెండు పార్టీలు కొట్లాడుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. అంటే బీఆర్ఎస్ ఎవరితోనూ పొత్తులు పెట్టుకునే అవకాశం లేదు. జాతీయ రాజకీయాల కోణంలో తెలంగాణలోనూ కొన్ని పార్టీలతో పొత్తులు పెట్టుకునే విషయాన్ని ఆలోచన చేయాలని గతంలో కేసీఆర్ అనుకున్నారు. కమ్యూనిస్టు పార్టీలతో పాటు బీఎస్పీ వంటి పార్టీలతో పొత్తుల గురించి ఆలోచించినట్లుగా తెలుస్తోంది. కారణం ఏదైనా కానీ..కేసీఆర్ జాతీయ రాజకీయాల విషయంలో పూర్తిగా సైలెంట్ అయ్యారు. గతంలోలా ఇతర రాష్ట్రాల నుంచి నేతల్ని పిలిపించి కండువాలు కప్పడం లేదు. బహిరంగ సభల ఆలోచనలు చేయలేదు. దీంతో ముందు తెలంగాణలో ఒంటరి పోరు చేసి.. బీఆర్ఎస్ ను గట్టెక్కించుకోవాలన్న ఆలోచన చేస్తున్నట్లుగా భావిస్తున్నారు.

# హుస్నాబాద్ నుంచి చాడా పోటీ

**మెదక్ :**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా సీపీఐ నుంచి చాడ వెంకటరెడ్డి బరిలోకి దిగుతారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. హుస్నాబాద్ లో సీపీఐ ప్రజా చైతన్య యాత్ర ముగింపు బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అంతకుముందు హుస్నాబాద్ లోని అంబేడ్కర్ చౌరస్తా నుండి స్థానిక బస్ డిపో గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన బహిరంగ సభాస్థలికి పార్టీ శ్రేణులు, సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకటరెడ్డి తో కలిసి ఆయన భారీ ర్యాలీగా తరలి వెళ్లారు. నిజాం పాలన నుంచి తెలంగాణకు విముక్తి కల్పించిన చరిత్ర కమ్యూనిస్టులం దన్నారు. కమ్యూనిస్టులు అమ్ముడు పోయారని ప్రచారం చేస్తున్నది ఎవర్రా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము రూపాయి ఖర్చు లేకుండా హుస్నాబాద్ లో చాడ వెంకట్ రెడ్డిని పోటీలో ఉంచుతామని స్థానిక ఎమ్మెల్యే సతీష్ కుమార్ కు చాలెంజ్ విసిరారు. రంగులతో అద్దితే తయారైన జెండాలు ఇతర పార్టీల జెండాలని, కానీ కమ్యూనిస్టు నాయకుల రక్తంతో తయారైన జెండా ఎర్రజెండా అన్నారు. తమ పొత్తు



ప్రజలతోనే ఉంటుందని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో హుస్నాబాద్ లో ఎర్రజెండా ఎగరడం ఖాయమన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అంబేద్కర్ పేరు పెట్టిన సచివాలయం ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు అనుకూలంగా ఉండాలి కానీ రాబందులకు అనుకూలంగా ఉండకూడదన్నారు. రాష్ట్రంలో ఉన్న సమస్యలను గాలికి వదిలేసి, మోడీపై పోరాడుతున్నామన్న సీఎం కేసీఆర్ వైఖరి సరికాదని, ముందు దేశంలోని బిజెపి వ్యతిరేక శక్తులను సమైక్యపరిచి, కార్యాచరణను రూపొందించాలన్నారు. మోడీ గడ్డం ఎంత పెరిగిందో, గ్యాస్ ధర అంతా పెరిగిందని, నిత్యవసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయన్నారు. బిజెపి అండతోనే దేశంలో కుబేరులు నల్లదనాన్ని తెల్లదనంగా మార్చుకుంటున్నారని ఆరోపిం చారు. జీఎస్టీలో కార్పొరేట్ వాళ్లకు పన్నుల తగ్గించి, సామాన్యులు వాడే వస్తువులపై పన్నుల శాతాన్ని పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగ పదవి అయిన ప్రధాని పదవిలో ఉన్న మోడీ కర్ణాటక ఎన్నికల ప్రచారంలో జై బజరంగబలి అనడం సిగ్గుచేటని, పార్లమెంట్ నుండి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని అన్యాయంగా తరలిస్తే, కర్ణాటకలో ప్రజలు మోడీని తరలించారన్నారు. అత్యాచారం చేసిన వారిని జైలు నుంచి విడిపించి సన్మానిస్తున్నారని, కేంద్ర హోం మంత్రి అమిత్ షా నంబర్ వన్ ఖూనీ కొరు, నేరస్తుడన్నారు. గాంధీని చంపిన గాడ్సే నోటి నుండి వచ్చినవాడు మోడీ అని, మోడీ పాలనలో దేశమంతా ముక్క చెక్కలు అవుతుందన్నారు. కేవలం కేరళలో ముగ్గురు మహిళలు కనిపించకుండా పోయిన దానిపైన సినిమా తీయించిన మోడీ, 46 వేల మంది గుజరాత్ లో కనబడకుండ పోయారనే విషయంపై ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. భూస్వాములకు న్యాయం చేయడానికే ముఖ్యమంత్రి కేసీఆర్ ధరణి పోర్టల్ తీసుకువచ్చాడని ఆరోపించారు. మన్ కీ బాత్ లో మోడీ వంద అబద్ధాలు ఆడుతున్నాడని, భారతదేశాన్ని కాపాడుకోవాలంటే మోడీ పోవాల్సిందేనన్నారు. నిజాం పాలన కంటే ఘోరంగా రాష్ట్రంలో కేసీఆర్ పాలన ఉందని ఎద్దేవా చేశారు.

# వీసీ వర్సెస్ పాలకమండలి

**హైదరాబాద్ :**

సమాజంలోని రుగ్మతలను అర్థం చేసుకొని, అధ్యయనం చేసి వాటికి అనుగుణంగా పరిశోధనలు చేసి పరిష్కార మార్గాలను సమాజానికి అందించాల్సిన విశ్వవిద్యాలయాలు ఈరోజు సమస్యల నిలయాలుగా, ఒకరినొకరు ముష్టి యుద్ధం చేసుకునే అధికారిక కేంద్రాలుగా, అక్రమ నియామకాల అడ్డాగా, కోట్ల ప్రజాధనం కొల్లగొట్టే నిలయాలుగా, అవినీతిని అందలం ఎక్కించే అక్రమ అధికారుల ఆవాసంగా, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గే బానిస కేంద్రాలుగా మారిపోయాయి. కొన్ని రోజులుగా తెలంగాణ వర్సిటీలో నెలకొన్న పరిస్థితులు, వీసీ-పాలక మండలి సభ్యులకు మధ్య జరుగుతున్న యుద్ధంతో వర్సిటీలో చదువుకుంటున్న విద్యార్థులు, పాఠాలు చెబుతున్న టీచర్లు, ఇతర ఉద్యోగులు పలు విధాలుగా ఆందోళనలు చెందుతున్నారు. ఈ వర్సిటీలో ఉద్యోగుల వేతనాలు చెల్లించడానికి కూడా నువ్వా నేనా తరహాలో వివాదం జరిగి ఉద్యోగులకు జీతాలు చెల్లించని పరిస్థితి ఉంది. ఈ వర్సిటీలో వీసీ ఒక రిజిస్ట్రార్‌ను, ఈసీ ఒక రిజిస్ట్రార్‌ను నియమించడంతో, అసలు రిజిస్ట్రార్ ఎవరో అర్థం కాని పరిస్థితి. మరోవైపు వీసీ లేకుండా ఈసీ సమావేశం నిర్వహించడంతో, ఈసీ సమావేశ నిర్ణయాలు చెల్లవని పత్రికా సమావేశంలో వీసీ ప్రకటిస్తున్నారు. అయితే ఈసీ సమావేశాల నిర్ణయాల అమలుపై కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ, యధావిధిగా వీసీ లేకుండా తనే చైర్మన్‌గా వ్యవహరిస్తూ ఒక ఈసీ మెంబర్ సమావేశం నిర్వహించడంతో ఈసీ, వీసీల మధ్య యుద్ధం మరింత రాజుకుంది. కాకతీయ యూనివర్సిటీలో సైతం వీసీ పాలనపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేయూ వీసీగా ప్రొ. రమేష్ నియామకం అక్రమంగా జరిగిందని, యూజీసీ నిబంధనలు ప్రభుత్వం ఉల్లఘించి ఆయనను వీసీగా నియమించిందని ఇద్దరు ప్రొఫెసర్లు కోర్టులో కేసు వేయగా, కేసు తేలక పోవడంతో వర్సిటీలో ఆయన దూకుడు ఎక్కువై, వర్సిటీలోని తోటి ప్రొఫెసర్ల పట్ల ఉన్న భేదాభిప్రాయాలతో వీసీగా అధికారం పొందగానే కక్షపూరితంగా ఒకరికి పదోన్నతి రాకుండా, మరొకరికి ప్రొఫెసర్ నుండి అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి తగ్గిస్తూ క్రమశిక్షణా చర్యలు తీసుకున్నాడు. పైగా భౌతికంగా ఎక్కడా లేని సెంటర్ల పేరు మీద సెమినార్లు నిర్వహిస్తూ లక్షల డబ్బును దుర్వినియోగ పరుస్తూ, తాను చేసిందే న్యాయం అన్న రీతిగా వ్యవహరిస్తున్నారు. పైగా వీసీగా వ్యవహరించడానికి అర్హత లేదని ఒకవైపు ఆరోపణలు వస్తున్నా, కేసు కోర్టులో వున్నా తాననుకున్నది యధావిధిగా రాజకీయ అండదండలతో పాలనను కొనసాగిస్తున్నారు. దీనిని ప్రశ్నించే విద్యార్థి, ఉద్యోగ సంఘాల నాయకులపై అక్రమ కేసులు పెట్టుకుంటూ, బదిలీలు చేస్తూ, షోకాజ్ నోటీసులు ఇస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. గతంలో అక్రమ ఫీజుల చలానాల కుంభకోణంలో ఉద్యోగం కోల్పోయిన వారిని ఏకంగా పరీక్షల విభాగంలో అక్రమంగా ఉద్యోగం కల్పించడం, ప్రభుత్వ అనుమతి లేకుండా యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా 12 మంది అనుబంధ అధ్యాపకుల నియామకంపై ఎంత రచ్చచేసినా తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అయితే రాష్ట్రంలోని అన్ని వర్సిటీల్లో ఇలాంటివి జరుగుతున్నా, ప్రభుత్వం మాత్రం ప్రేక్షక పాత్ర వహించడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వారు నియమించిన వీసీలపై ఉన్న అవినీతి ఆరోపణలపై, అక్రమ నియామకాలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఏది ఏమయినా ఒకవైపు వర్సిటీల వీసీల నియామకంపై కేసులు, మరొకవైపు వీసీల పాలనపై పలు ఆరోపణలు, వీసీ - ఈసీల మధ్య మాటల యుద్ధం వీటన్నింటిపై ప్రభుత్వం స్పందిస్తుందా లేదా సమస్యలను గాలికి వదిలేసి వర్సిటీలను అధోగతి పాలు చేస్తుందా చూడాలి. నిజానికి వర్సిటీలకు ఛాన్సలర్‌గా వ్యవహరించే హోదా గవర్నర్‌కు ఇచ్చినప్పటికీ, గవర్నర్ ప్రభుత్వం పంపించిన ప్రతిపాదనపై ఎటువంటి విచారణ, పునసమీక్ష లేకుండా యధావిధిగా ఆ ప్రతిపాదనను ఆమోదించి వీసీల అసమర్థ పాలనకు, వర్సిటీల్లో అనేక సమస్యలకు తెరలేపినట్లయిందనే విమర్శలు వస్తున్నాయి. విశ్వవిద్యాలయాలలో జరిగే నియామకంలో పునసమీక్ష చేసే అధికారం గవర్నర్ వినియోగించుకుంటే తప్ప వర్సిటీల్లోని సమస్యలకు పరిష్కారం దొరకదని మేధావులు భావిస్తున్నారు. ఎలాగో ప్రభుత్వం వర్సిటీలను చిన్న చూపు చూస్తోందని, వర్సిటీలను నిర్వీర్యం చేసే ఆలోచనలతో ప్రైవేటు వర్సిటీలు ఆజ్యం పోస్తూ, సమస్యలను గాలికి వదిలేసిన ఈ తరుణంలో ఛాన్సలర్ మాత్రమే వర్సిటీల సమస్యలకు చెక్ పెట్టగలరని విద్యార్థి, ఉద్యోగ సంఘాలు నమ్ముతున్నారు.

# అవినీతిపై కమీషనర్ కొరడా

**హైదరాబాద్ :**

మహానగరంలోని కోటిన్నర మందికి అత్యవసర సేవలందించే జీహెచ్ఎంసీ కమిషనర్‌కు మొట్టమొదటి సారిగా కోపమొచ్చింది. లాంగ్ స్టాండింగ్ కమిషనర్ లోకేశ్ కుమార్ సోమవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి డిప్యూటీ కమిషనర్లు, జోనల్ కమిషనర్ల అవినీతి, పనితీరుపై తీవ్రస్థాయిలో మండిపడినట్లు సమాచారం. ఈ నెల 17 వరకు సెలవుల్లో ఉన్న కమిషనర్ హఠాత్తుగా టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సీరియస్ కావటం సంచలనంగా మారింది. కరోనా కన్నా ముందు 2019లో జీహెచ్ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన లోకేశ్ ఇప్పటి వరకు గ్రేటర్ నగరంలో ఏ ఘటన జరిగినా, ఎంతమంది ప్రాణాలు కోల్పోయినా కనీసం ఘటనాస్థలాన్ని సందర్శించలేదు. అలాంటి కమిషనర్‌కు మొట్టమొదటి సారిగా కోపం రావటం, ఆయన అధికారులకు క్లాసు తీసుకున్నట్లు సమాచారం. గడిచిన మూడున్నరేళ్లలో ఏరోజు కనీసం ప్రశ్నించని ఆయన అధికారులపై ఉన్నట్టుండి ఫైర్ కావటం జీహెచ్ఎంసీలో చర్చనీయాంశమైంది. పౌర సేవల నిర్వహణ, అభివృద్ధి పనుల పరిశీలన, పరిపాలన వ్యవహారాలకు సంబంధించిన డిప్యూటీ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు విధులు నిర్వహిస్తున్న తీరుపై తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేసిన కమిషనర్ త్వరలోనే డిప్యూటీ కమిషనర్లు, జోనల్ కమిషనర్లకు సంబంధించిన పలు అధికారాలను కట్ చేసే యోచనలో ఉన్నట్లు సమాచారం. జీహెచ్ఎంసీలో పూర్తిగా అవినీతిమయమైన శానిటేషన్ విభాగానికి సంబంధించి డిప్యూటీ కమిషనర్లు, జోనల్ కమిషనర్లపై అనేక రకాల అవినీతి ఆరోపణలున్నాయి. ఈ అవినీతికి చెక్ పెట్టేందుకు చాలా సర్కిళ్లలో శానిటేషన్‌ను పర్యవేక్షిస్తున్న మెడికల్ ఆఫీసర్లలో కొంతమందిని తమ మాతృశాఖకు సరెండర్ చేసి, వారి స్థానంలో ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్లను నియమించారు. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు. మెడికల్ ఆఫీసర్లు చేసిన అక్రమాలనే ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్లు కొనసాగించటం, దానికి డిప్యూటీ కమిషనర్లు వంతపాడటం, వారికి జోనల్ కమిషనర్ల అండదండలున్నట్లు కమిషనర్ గుర్తించినట్లు సమాచారం. ఈ క్రమంలో ఇటీవలే 150 మంది శానిటరీ జవాన్లను వార్డు శానిటేషన్ ఆఫీసర్లకు నియమిస్తూ ఈ నెల 10న కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో శానిటేషన్ మొత్తం బాధ్యతలను వీరికి అప్పగించి, శానిటేషన్ వర్కర్ల జీతాలను క్లెయిమ్ చేసే అధికారం నుంచి డిప్యూటీ కమిషనర్లను కట్ చేస్తారా? లేక మాతృశాఖలకు సరెండర్ చేస్తారా? అన్నది చర్చనీయాంశంగా మారింది. మొత్తానికి మూడున్నరేళ్లలో ఒక్కసారైనా కమిషనర్ అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించటం పట్ల అక్రమార్కుల బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

## కమ్యూనిస్టులకు అధికారం లేకపోయిన ప్రభుత్వాలను కదిలించే శక్తి ఉంది

## -సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనం నేని సాంబశివరావు

**భద్రాద్రి కొత్తగూడెం**

మనిషి స్వేచ్ఛను అడ్డుకుంటే ప్రజా తీర్పు ఎలా ఉంటుందో, కర్ణాటకలో జరిగిన ఎన్నికల్లో బిజెపి పార్టీకి కర్ణాటక ప్రజలు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పారని ,సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనం నేని సాంబశివరావు అన్నారు. భద్రాచలం విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే కోనంనేని మంగళవారం స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలోపాల్గొని, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రావులపల్లి రాంప్రసాద్ తో కలిసి మాట్లాడారు,కర్ణాటక ఎన్నికల్లో బిజెపి ఓటమితో కర్ణాటక ప్రజలు పండగ జరుపుకుంటున్నారని,మతాన్ని చూపించి రాజకీయాలు చేయవద్దని, ప్రజా సంక్షేమ వ్యతిరేక పాలనే బిజెపి ఓటమి చూసింది అన్నారు. బిజెపిని దేశంలో గద్దదించడానికి ప్రతిపక్ష పార్టీలతో కలసి మేము పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఆయనతెలిచేశారు. కమ్యూనిస్టులకు అధికారంలేకపోయినా ప్రభుత్వా లను కదిలించే శక్తి ఉందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో అధికార బిఆర్ఎస్ పార్టీ, ప్రతిపక్షాలను కలుపు కొని బిజెపి దేశంలో లేకుండ చేయడమే లక్ష్యముగా పనిచేయాలనిఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో జూనియర్ కార్యదర్శులు నియమకాలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది, వారి సమస్యలను పరిష్కరించడం కూడ రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతే, అప్రెంటిస్ పేరుతో నాలుగు సంవత్సరాలు ప్రభుత్వం వారి సేవలను ఉపయోగించుకున్నదని కనుక జూనియర్ కార్యదర్శుల కు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని ఆయన భద్రాద్రి డిమాండ్ చేశారు. దక్షిణ అయోధ్య గా బాసిల్లిన భద్రాద్రి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని భద్రాచలం పట్టణ అభివృద్ధికి 100 కోట్లు,1000కోట్లు ఇస్తానని ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి కేసీఆర్ నెరవేర్చాలని కోరారు. దేశంలో లౌకిక శక్తులు అన్ని ఏకమై కేసీఆర్ తో కలిసి రావాలని, వచ్చే నెల నాలుగో తేదీన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రజా సమస్యలపై లక్ష మందితో సిపిఐ ప్రజాగర్జన భారీ బహిరంగ సభ ఏర్పాట్లకు సిద్ధం చేస్తున్నామని కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కల్లూరు వెంకటేశ్వర్లు, సీపీఐ పట్టణ కార్యదర్శి ఆకోజు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు వర్శిటీ హోదా రాకుండానే గురునానక్, శ్రీనిధి కాలేజీల్లో 4 వేల మందికి అడ్మిషన్లు ఎలా ఇస్తారు?

**కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలతో ఆటలాడుతోంది**

**కౌన్సిలింగ్ ప్రారంభం కాకుండానే ఇంజనీరింగ్ అడ్మిషన్ల దందా చేస్తారా?**

**కేసీఆర్ ప్రభుత్వం డబ్బులకు అమ్ముడుపోయి విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తోంది**

**ప్రమోషన్లకు అమ్ముడుపోయిన కొందరు పోలీసులు ఏబీవీపీ నాయకులను వేధిస్తున్నారు**

**దళితులను తిట్టిన మంత్రి శ్రీనివాస్ గౌడ్ పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాల్సిందే**

**కేసీఆర్ సర్కార్ పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్ కుమార్ ఫైర్**



**హైదరాబాద్**

కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలతో ఆటలాడుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్ కుమార్ ధ్వజమెత్తారు.. చివరకు విద్యార్థుల భవిష్యత్ నాశనమవుతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రైవేటు వర్శిటీ హోదా రాకుండానే శ్రీనిధి, గురునానక్ ఇంజనీరింగ్ కాలేజీలు 4 వేల మంది విద్యార్థుల వద్ద డబ్బులు తీసుకుని వాళ్ల జీవితాలను నాశనం చేస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. విద్యార్థులకు న్యాయం చేయాలని ఉన్నత విద్యా మండలి ఎదుట ధర్నా చేసిన ఏబీవీపీ నాయకులను అరెస్ట్ చేసి థర్డ్ డిగ్రీ ప్రవేశపెట్టడం సిగ్గు చేటన్నారు.. తక్షణమే బాధ్యులైన ఏసీపీసహా పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని ఇంతటి వదిలిపెట్టేది లేదని, జాతీయ మానవ హక్కుల కమిషన్, మహిళా కమిషన్ ను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. ఈరోజు దిల్ సుఖ్ నగర్ లోని ఏబీవీపీ విభాగ్ కార్యాలయానికి వెళ్లిన బండి సంజయ్ పోలీసుల దాడిలో గాయపడ్డ ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీని పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలతో ఆటలాడుతోంది. డబ్బు, అధికారం కోసం ఎంతకైనా దిగజారుతోంది. డబ్బులిస్తే చాలు ఎవరి జీవితాలు నాశనమైనా డోన్ట్ కేర్ అన్నట్లు వ్యవహరిస్తోంది. డబ్బులకు కక్కుర్తిపడి టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ చేసి 30 లక్షల మంది నిరుద్యోగుల భవిష్యత్తును నాశనం చేసిన కేసీఆర్ కుటుంబం ఇయాళ ఇంజనీరింగ్ విద్యార్థుల జీవితాలను కూడా ప్రమాదంలో నెట్టేసేందుకు సిద్ధమైంది. ఇప్పటివరకు ఎంసెట్ ఫలితాలు రాలేదు.. ఇంజనీరింగ్ కౌన్సిలింగ్ మొదలు కాలేదు.. కానీ అప్పుడే ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల దందా మొదలుపెట్టింది. ఇంకా దుర్మార్గమేందంటే... అనుమతి లేకుండానే ప్రైవేటు యూనివర్శిటీల పేరుతో పెద్ద దందా జరుగుతోంది.

గురునానక్, శ్రీనిధి ఇంజనీరింగ్ కాలేజీలకు ఇంతవరకు అటానమస్ (ప్రైవేట్ వర్శిటీ) హోదా రాలేదు. ఇప్పటి వరకు అనుమతి రాలేదు.. అయినా ఆ కాలేజీల్లో ఇప్పటి నుండే ఇంజనీరింగ్ సీట్ల దందా మొదలైంది. మాది ప్రైవేట్ వర్శిటీ అని ప్రచారం చేసుకుంటూ వేలాది మంది విద్యార్థుల వద్ద అడ్మిషన్ల పేరుతో కోట్ల రూపాయలు వసూలు చేస్తున్నరు. ఈ రెండు కాలేజీల్లోనే ప్రత్యేక వర్శిటీలని చెప్పుకుంటూ దాదాపు 4 వేల మంది విద్యార్థుల నుండి ఇప్పటికే డబ్బులు కట్టించుకున్నయ్.. ఇంత దుర్మార్గమా? దీనిపై ఏబీవీపీ నాయకులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. కానీ ఇది చేతగాని, మూర్ఖత్వ, నయా నిజాం ప్రభుత్వమిది. కాలేజీల నుండి డబ్బులు తీసుకుంటున్నట్లుంది. వాళ్ల కమిషన్ల కోసం విద్యార్థుల జీవితాలను నాశనమైనా పట్టించుకోదు. దీనిపై ఏబీవీపీ ప్రజాస్వామ్యబద్దంగా పోరాటం చేస్తోంది. ఆ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల జీవితాలను కాపాడాలని ఏబీవీపీ ఆందోళన చేస్తోంది. నమ్మిన సిద్ధాంతం కోసం నక్సలైట్ల పోరాడిన చరిత్ర ఉన్న సంఘం ఏబీవీపీదే. స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఉద్యమిస్తే ఆ విద్యార్థుల సమస్యలపై చర్చించి పరిష్కరించాల్సిన ప్రభుత్వం మూర్ఖంగా వ్యవహరిస్తోంది. ఈ సర్కారు సిగ్గు లేనిది. ప్రజలు ప్రభుత్వం మీద ఉమ్మేస్తున్నా సిగ్గు రావడం లేదు. పోరాటం చేస్తున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీసహా నాయకులను అరెస్టు చేసి కేసులు పెడుతున్నారు. బెదిరిస్తున్నారు.

టార్గెట్ చేసి ఝాన్సీని ఎత్తుకుపోయిన పోలీసులు లాఠీలతో కుళ్ల పొడుస్తారా? థర్డ్ డిగ్రీ ఉపయోగిస్తారా? ఆత్మరక్షణ కోసం ఎదిరిస్తే పోలీసులనే కొడుతోందంటూ దుష్ప్రచారం చేస్తారా? ఇది ప్రజాస్వామ్య ప్రభుత్వమా? లేక రౌడీ రాజ్యమా? న్యాయం పక్షాన పోరాడుతున్న వారికి అండగా ఉండాల్సింది పోయి లంగ దందా చేసే వాళ్ల తరపున వకాల్తా పుచ్చుకుంటారా? కొందరు పోలీసులు సీఎం మోచేతి నీళ్లు తాగుతున్నరు. కొడుతున్నారు. అసలు కొట్టే హక్కు మీకెవరు ఇచ్చారు? ఆమె చేసిన తప్పేంటి? విద్యార్థుల పక్షాన ప్రశ్నిస్తే కొడతారా? విద్యార్థిని అని కూడా చూడకుండా టార్గెట్ చేసి థర్డ్ డిగ్రీ ఇస్తారా? కుటుంబ సభ్యులకు కూడా సమాచారమివ్వకుండా చిత్రహింసలకు గురిచేస్తారా? శాంతిభద్రతలను కాపాడే తీరు ఇదేనా? మీరు దాడులు చేస్తే సీసీ పుటేజీల్లో రికార్డు కానివ్వరు... థర్డ్ డిగ్రీని భరించలేక ఆత్మ రక్షణ కోసం ఎదురుదాడి చేస్తే పోలీసులనే కొట్టారంటూ సీసీ పుటేజీలు రిలీజ్ చేసి కేసులు పెట్టి వేధిస్తారా? 4 వేల మంది విద్యార్థుల పక్షాన ఫైట్ చేస్తున్న వారికి అండగా ఉండాల్సింది పోయి దాడులు చేసి పోలీసుల ప్రతిష్టను దెబ్బతీసుకుంటారా? తక్షణమే థర్డ్ డిగ్రీ ప్రయోగించిన ఏసీపీసహా పోలీసులపై చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో మహిళా కమిషన్ సహా జాతీయ మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తాం. దోషులను శిక్షించేదాకా, 4 వేల మంది విద్యార్థుల భవిష్యత్ ను కాపాడేదాకా పోరాడదాం... ఈ ప్రభుత్వానికి పరీక్షలు నిర్వహించడం చేతగాదు.. పేపర్ లీకేజీ పేరుతో లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతున్న ప్రభుత్వమిది. ఇయాళ ఇంజనీరింగ్ విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతున్నా పట్టించుకోవడం లేదంటే ఏమనాలి? ఒకవైపు నిరుద్యోగులు అల్లాడుతున్నరు. పేపర్ లీకేజీ దోషులపై చర్యలు తీసుకోరు. విచారణ పూర్తి కాదు.. నిందితులుగా అరెస్టయిన వాళ్లు జైలు నుండి బయటకు వచ్చి దర్జాగా తిరుగుతున్నరు. లీకేజీకి కారకులైన సీఎం కొడుకు విదేశాల్లో తిరుగుతున్నడు... ఈటల రాజేందర్ కాంగ్రెస్ నాయకులను కలవడానికి వెళ్లారా? లేక ఇతర పార్టీలను కలవడానికి వెళ్లారా? ఆయన మా పార్టీ నాయకులు... మా జాతీయ నాయకత్వాన్ని కలిసేందుకు వెళితే తప్పేముంది? మా పార్టీలో ఆ స్వేచ్ఛ ఉంది.. ఎప్పుడైనా కలిసే అవకాశం ఉంది. దళితులను థర్డ్ క్లాస్ ఫెలోస్ అంటూ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్న వ్యాఖ్యలపై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.... ఆ మంత్రికి ఎంత కండకావరం? దళిత సంఘాలు ఏం చేస్తున్నాయి? అంబేద్కర్ రాజ్యాంగం పుణ్యమా? అని నువ్వు ఎమ్మెల్యే అయినవ్. మంత్రి పదవి వచ్చింది. లేకుంటే నీది బిచ్చపు బతుకులయ్యేది. రాజకీయాలు ఏ విధంగా దిగజారుతున్నాయో నిదర్శనమిది. అతనిపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు ఎందుకు పెట్టకూడదు? నాన్ బెయిలెబుల్ కేసు పెట్టాలి. లేకుంటే దళితులకు రక్షణ ఏది? ఇట్లనే కొనసాగితే ప్రతి ఒక్క బీఆర్ఎస్ నాయకులు దళితులను తిట్టే అవకాశముందని అన్నారు.

# టి కాంగ్రెస్ లో లీడర్ల కొరత వుంది

**హైదరాబాద్**



తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ 2014లో 21 గెలిచింది. 2018లో 19సీట్లు గెలిచింది. పెద్ద చరిత్ర ఉన్న పార్టీ గెలిచిన సీట్లను ఎంతమందిని నిలుపుకుంది. కేవలం 5మంది మాత్రమే పార్టీలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలో లీడర్ షిప్ కొరత ఉంది. అందుకే ఎమ్మెల్యేలను నిలుపుకోలేకపోతోందని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి షర్మిల అన్నారు. ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీకి ఎంతో వైభవం ఉంది. వైఎస్సార్ హయాంలో రాష్ట్రంలో ఒక ప్రాంతీయ పార్టీలా ఉండేది. వైఎస్సార్ లేని కాంగ్రెస్ ఇప్పుడు జీరో. క్యాడర్ , లీడర్ ను నిలుపుకుంటే కాంగ్రెస్ పై నమ్మకం ఉండేది. ఇప్పుడు ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై నమ్మకం లేదు. ఇప్పుడు భయటనుంచి లీడర్లను తెచ్చుకొనే పరిస్థితి ఉందని ఆమె అన్నారు. ఇప్పుడు లీడర్లను నిలుపుకొనే సత్తా ఉందా లేదా సమాధానం చెప్పాలి. కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయాలని అనుకుంటే నేను పార్టీ ఎందుకు పెట్టాలి. విలీనం చేయాలని అనుకుంటే రెండేళ్లుగా కిందపడి మీదపడి పార్టీని ఎందుకు నడపాలి. విలీనం చేయాలని అలోచన ఉంటే 3800కిలోమీటర్ల పాదయాత్ర ఎందుకు చేయాలి. విలీనం చేయాలని అనుకుంటే పార్టీ పెట్టకముందే నాకు ఎన్నో ఆఫర్లు ఉన్నాయి. అవన్నీ కాదని వైఎస్సార్ పేరు మీద పార్టీ పెట్టింది విలీనం చేయడానికి కాదని ఆమె స్పష్టం చేసారు. రాష్ట్రంలో ఎన్నో పోరాటాలు చేసి వైఎస్సార్ తెలంగాణ పార్టీ ఒక ఫోర్స్ లా తయారయ్యింది. తెలంగాణాలో షర్మిల అంటే తెలియని వాళ్లు లేరు. ఢిల్లీ కి చెందిన ఒక సర్వే సంస్థ 44సీట్లలో ప్రభావం చూపిస్తుందని తేలింది. ఇది నేను చేసిన సర్వే కాదు. నాకు సంబంధం లేదు. 44సీట్లలో నా ప్రభావం ఉంటే.. 5 సీట్లకో...10సీట్లకో పొత్తులకు పోవాల్సిన అవసరం నాకు లేదు. కాంగ్రెస్ కు లీడర్ షిప్ ఉన్నా... దాన్ని నిలుపుకొనే సత్తా రాష్ట్రంలో లేదు. కర్నాటక కాంగ్రెస్ లో కష్టపడి పనిచేసే వాళ్లు ఉన్నారు. కర్నాటకలో డీకే శివకుమార్ చాలా కష్టపడ్డారు. అందుకే పార్టీ అధికారంలోకి వచ్చింది. తెలంగాణలో పక్క పార్టీల నాయకులను తీసుకొచ్చి వీళ్లే నాయకులు అంటే ఎలా. 19మంది గెలిస్తే 5గురు మిగిలితే ఇక్కడ కాంగ్రెస్ లో క్రెడిబిలిటి ఉన్నట్లా. ఇది ఎన్నికల ఏడాది..అన్ని పార్టీలు అన్ని ప్రయత్నాలు చేస్తాయి. కాంగ్రెస్ పార్టీనుంచి ఎన్నో మిస్డ్ కాల్స్ వస్తున్నాయి. నేను ఇప్పటివరకు ఎటువంటి కాల్స్ లిఫ్ట్ చేయలేదని వెల్లడించారు. ఒకవేల కాల్ లిఫ్ట్ చేస్తే మొదటగా నేనే మీడియాకు చెప్తాను. డీకే.శివకుమార్ మాకు ముందునుంచి పరిచయం వుంది. వైఎస్సార్ ను శివకుమార్ ఆదర్శంగా తీసుకున్నాడు. వైఎస్సార్ లా కష్టపడ్డాడు కాబట్టి... కర్నాటకలో అధికారంలో వచ్చాడు. ఆయన లేకుంటే కర్నాటకలో కాంగ్రెస్ పార్టీ అనేదే లేదు. అందుకే కలిసి అభినందనలు తెలియజేశాను. కర్నాటక ఫలితాలు ఒక చెంపపెట్టు. మత రాజకీయాలకు,కుల్లు రాజకీయాలకు చెంపపెట్టు. అక్కడ ప్రభావం ఇక్కడ కూడా ఉంటుంది. తెలంగాణలో కేసీఆర్ పార్టీని బొందపెట్టడం ఖాయం. టీఎస్పీఎస్సీ పేపర్ లీకులు తెలంగాణ రాష్ట్రానికి సిగ్గు చేటని అన్నారు. లక్షలమంది బిడ్డల ఆశలు అడియాశలయ్యాయి. అయినా ఇది చిన్న విషయం అని కేసీఆర్ అంటున్నాడు. సిట్ దర్యాప్తు వేసి సైలెంట్ గా సెట్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. పేపర్ లీకుల్లో ఐటిశాఖ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందని ఆమె ఆరోపించారు.

# డెంగ్యూ నిర్మూలన మన సామాజిక బాధ్యత

**ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్**

**సూర్యాపేట**

అందని ద్రాక్షగా ఉన్న ఖరీదైన కార్పొరేట్, ప్రవేట్ వైద్యం తెలంగాణ ప్రభుత్వం పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందుబాటులోకి తెచ్చిందని కోదాడ అభివృద్ధి ప్రదాత, శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలోని కాశీనాథన్ ఫంక్షన్ హాల్ లో జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సదస్సు మానవహరం ర్యాలీల్లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, గత పాలకవర్గాలు ప్రజా ఆరోగ్యాన్ని గాలికి వదిలేసాయని వారి నిర్లక్ష్యంతో శిశుమరణాలు, అంటువ్యాధులు ప్రభలి ఎంతోమంది ప్రాణాలు కోల్పోయే వారన్నారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజారోగ్యం లక్ష్యంగా తీసుకుని ప్రజల ఇంటి ముంగిటకు వైద్యం అందుబాటులోకి తెచ్చింది అన్నారు. గ్రామాల్లో పల్లె దవఖానాలు ఏర్పాటు చేయడం పట్నాలలో బస్తీ దవఖాన ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తల్లి గర్భం లో ఉన్న శిశువు మొదలుకొని వయోవృద్ధుల వరకు ప్రభుత్వం అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా చికిత్స అందిస్తుందన్నారు. డెంగ్యూ ,మలేరియా, కలరా వంటి వ్యాధుల నివారణ మనందరి సామాజిక బాధ్యత అన్నారు. పరిసరాల పరిశుభ్రత తోనే అంటు వ్యాధుల నిర్మూలన జరుగుతుందన్నారు. ఇంటి పరిసరాల్లో వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మురుగునీరు నిల్వ ఉండటం వలన దోమల వ్యాప్తి జరుగుతుందని పారిశుద్ధ్య సిబ్బంది అప్రమత్తం కావాలన్నారు. డెంగ్యూ వ్యాధికి గురైన వారికి ప్రభుత్వ వైద్యం తక్షణమే అందిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీ మానవహారం లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి కోటాచలం, ఉప వైద్యాధికారి నిరంజన్, డాక్టర్లు కళ్యాణ్ చక్రవర్తి, సాహితీ, వెంకటరమణ,మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, యూనియన్ లీడర్ యాతాకుల మధుబాబు, ఏ ఎం ఓ షాబుద్దీన్, శైలజ, చందు నాగేశ్వరరావు, వెంపటి మధుసూదన్, షేక్ మదర్, అపర్ణ వెంకట్, కందుల చంద్రశేఖర్, వంటిపులి శ్రీనివాస్, సర్పంచులు జొన్నలగడ్డ శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, సంపేట ఉపేందర్ గౌడ్, డాక్టర్లు, వైద్య అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్న చోట్ల టీఎంసీ మద్దతు

**కోల్‌కతా :**



బీజేపీకి వ్యతిరేకంగా 2024 లోక్‌సభ ఎన్నికల్లో 'ఐక్య విపక్ష కూటమి' ఏర్పాటుకు చురుకుగా సన్నాహాలు జరుగుతున్న నేపథ్యంలో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్న చోట్ల టీఎంసీ మద్దతు ఇస్తుందని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో విపక్ష ఐక్యతకు సంబంధించి టీఎంసీ వ్యూహాన్ని మమతా బెనర్జీ స్పష్టం చేయడం ఇదే మొదటిసారి.'కాంగ్రెస్ పార్టీ ఎక్కడైతే బలంగా ఉందో అక్కడ ఆ పార్టీ పోరాడుతుంది. వారికి మేము సపోర్ట్‌గా నిలుస్తాం. అందులో తప్పేమీ లేదు. అయితే వారు కూడా ఇతర రాజకీయ పార్టీలకు సపోర్ట్‌గా నిలవాలి" అని సోమవారంనాడు సెక్రటేరియట్‌లో జరిగిన మీడియా సమావేశంలో మమతా బెనర్జీ అన్నారు. సీట్ల కేటాయింపు ఫార్ములా విషయంలోనూ ప్రాంతీయ పార్టీలు ఎక్కడైతే బలంగా ఉన్నాయో అక్కడ వారికి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుందని అన్నారు.

**కర్ణాటక ప్రజలకు సెల్యూట్...**

కాగా, ఈ నెల 13వ తేదీన వెలువడిన కర్ణాటక ఫలితాల్లో బీజేపీ అధికారం కోల్పోయిన వెంటనే మమతా బెనర్జీ ఆ రాష్ట్ర ప్రజలకు సెల్యూట్ చేశారు. కాంగ్రెస్ పేరు మాత్రం ఆమె ప్రస్తావించ లేదు. ఒకప్పుడు కాంగ్రెస్‌లో ఉన్న మమతా బెనర్జీ ఆ తర్వాత పార్టీని వీడి టీఎంసీని ఏర్పాటు చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ టీఎంసీ ఘనవిజయం సాధించింది. ఈ క్రమంలో బీజేపీకి వ్యతిరేకంగా 2024 లోక్‌సభ ఎన్నికల్లో విపక్ష ఐక్య కూటమి ఏర్పాటు అవసరాన్ని మమతా బెనర్జీ గట్టిగా చెబుతున్నారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఇటీవల ఆ ప్రయత్నాలను వేగవంతం చేశారు. పలు రాష్ట్రాల్లో పర్యటించి బీజేపీ వ్యతిరేక పార్టీల (విపక్షాల) నేతలను కలుసుకుంటున్నారు. జాతీయ స్థాయి పార్టీ కాంగ్రెస్‌ను కలుపుకోకుండా విపక్ష ఐక్యత సాధ్యం కాదనే సంకేతాలు కూడా ఇచ్చారు. ఈ క్రమంలో కాంగ్రెస్ బలంగా ఉన్న రాష్ట్రాల్లో ఆ పార్టీకి టీఎంసీ మద్దతు ఉంటుందని మమత ప్రకటించడం విపక్ష ఐక్యతా యత్నాల్లో మరో ముందడుగుగా విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

# కరీంనగర్ లో కొలువుదీరనున్న శ్రీ వేంకటేశ్వరుడు

**కరీంనగర్**



ఉత్తర తెలంగాణ ప్రజలకు కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరుని దర్శనం చేరువ కాబోతోంది. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ కరీంనగర్లో 10ఎకరాల స్థలాన్నిటీటీడీ ఆలయానికి కేటాయించారు. స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయిన్పల్లి వినోద్ కుమార్ల తీవ్ర కృషితో కరీంనగర్ వాసులకు ఆ వెంకటేశ్వరుని దర్శన కల సాకారం ఔతుంది. ఈ మేరకు నేడు హైదరాబాద్లోని తన నివాసంలో టీటీడీ చైర్మన్ వై వి సుబ్బారెడ్డి, కరీంనగర్ టీటీడీ ఆలయ నిర్మాణ అనుమతి పత్రాలను రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయిన్పల్లి వినోద్ కుమార్, టీటీడీ తెలంగాణ లోకల్ అడ్వజరీ కమిటీ చైర్మన్ భాస్కరరావు లకు అందజేసారు. ఈ సందర్భంగా వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ విజ్ఞప్తి మేరకు ఏపీ సీఎం జగన్ ఆదేశాలతో కరీంనగర్ పట్టణంలో 20 కోట్ల వ్యయంతో టిటిడి ఆధ్వర్యంలో శ్రీవారి ఆలయాన్ని నిర్మిస్తున్నామని, మే 31వ తేదీన ఉదయం 7గం. 26 నిమిషాలకు శంకుస్థాపన కార్యక్రమం వేదమంత్రోచ్చారణలతో నిర్వహిస్తామన్నారు. అనంతరం అదే ప్రాంగణంలో సాయంత్రం నుండి కరీంనగర్ ప్రజలతోపాటు ఉత్తర తెలంగాణ ప్రజలకు శ్రీవారి ఆశీస్సులు అందించే విదంగా కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరుని కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ త్వరలోనే వినోద్ రావు, బాస్కర్ రావులతో కలిసి తిరుమలకు వెల్తామని, ఆగమశాస్త్రం ప్రకారం కరీంనగర్ పద్మనగర్లో నిర్మించే శ్రీవెంకటేశ్వర ఆలయం యెక్క అంతరాలయం, గోపురాలు, బాహ్యాలయ నిర్మాణాల నమూనాలతో పాటు మూల విరాట్టు, పోటు, ప్రసాధ వితరణ కేంద్రం, తదితర అన్ని అంశాలను పరిశీలిస్తామన్నారు. అత్యంత త్వరలోనే శ్రీవారి ఆలయ నిర్మాణం పూర్తి చేసి కరీంనగర్తో పాటు తెలంగాణ ప్రజలకు ఆ దేవదేవుని ఆశిస్సులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి గంగుల కమలాకర్ తో పాటు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయిన్పల్లి వినోద్ కుమార్, టిటిడి బోర్డు చైర్మన్ వై వి సుబ్బారెడ్డి, టీటీడీ తెలంగాణ లోకల్ అడ్వజరీ కమిటీ చైర్మన్ భాస్కరరావు పాల్గొన్నారు.

# కేటీఆర్ వ్యాఖ్యలు అర్ధరహితం

**జగిత్యాల**

ప్రభుత్వ ఉద్యోగాలన్ని భర్తీ చేస్తే సీఎం కేసీఆర్ కు మంచి పేరు వస్తుందని ఓర్వలేక ప్రతిపక్షాలు టిఎస్పీఎస్సీ,ఎస్సెస్సీ పేపర్లు లీక్ చేశాయని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా అర్ధరహితంగా ఉన్నాయని అవి టిఆర్ఎస్ నాయకుల పరిపాలన చేతగాని తానానికి నిదర్శనమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్ విమర్శించారు. మంగళవారం పెగడపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల సంఖ్య తెలుసుకోవడానికి వేసిన బిశ్వాల్ కమిటీ తెలంగాణ రాష్ట్రంలో వివిధ శాఖల్లో 1,92,126 ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయని తేల్చితే మంత్రి కేటీఆర్ రెండు లక్షల 20వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామని వ్యాఖ్యానించడం వారి అవగాహన రాహిత్యానికి అంకెల గారడికి నిదర్శనం అన్నారు. ప్రశ్నాపత్రం లీకేజీ కేసులో ప్రతిపక్షాల పాత్ర ఉన్నట్లయితే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వేసిన ప్రత్యేక అధికారుల విచారణ బృందం తమ విచారణలో ప్రతిపక్ష నాయకుల పేర్లు ఎందుకు వెల్లడించడం లేదని అన్నారు. ఇటీవలే జగిత్యాల జిల్లాలో జరిగిన బస్సు సీటు గొడవ విషయంలో ఒక ఎస్సైని సస్పెండ్ చేసిన ప్రభుత్వం టీఎస్పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీకి బాధ్యులై 33 లక్షలమంది నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడిన టీఎస్పీఎస్సీ చైర్మన్ ను ఎందుకు సస్పెండ్ చేయలేదని ప్రశ్నించారు. అధికారంలో ఉండి ప్రభుత్వం వైఫల్యం చెందితే దానికి ప్రతిపక్షాలను నిందించడం రాష్ట్ర ప్రజలు బాగుపడితే సంబరపడాలి కానీ అందుకు భిన్నంగా ప్రతిపక్ష పార్టీల కళ్ళు మండుతున్నాయి..


# 'మేమ్ ఫేమస్' థర్డ్ సింగిల్ దోస్తులం లాంచ్





లహరి ఫిలింస్, చాయ్ బిస్కెట్ ఫిల్మ్స్ నుంచి వస్తోన్న రెండవ చిత్రం 'మేమ్ ఫేమస్'. ఇప్పటికే ప్రామెసింగ్ ప్రమోషనల్ కంటెంట్ తో టీం బజ్ క్రియేట్ చేసింది. తాజాగా దర్శకుడు తరుణ్ భాస్కర్ థర్డ్ సింగిల్ దోస్తులం పాటని లాంచ్ చేశారు. దోస్తులం.. స్నేహం, ఒకరితో ఒకరు మంచిగా ఉండటంలో వున్న గొప్పతనాన్ని వివరించే పాట. గుడ్ టైం ని సెలబ్రేట్ చేసుకొని, చెడు సమయాల్లో సహాయాన్ని అందించేది ఫ్రండ్షిప్. కళ్యాణ్ నాయక్ ఈ బ్యూటీఫుల్ సాంగ్ ని స్వరపరిచి, కోటి మామిడాలతో పాటు సాహిత్యం కూడా రాశారు. కాల భైరవ పాటను మెస్మరైజ్ చేసేలా ఆలపించారు.

ఈ పాటలో డిఫరెంట్ లేయర్స్ ఉన్నాయి. కళ్యాణ్ నాయక్ చక్కని కంపోజిషన్ చేశారు. సుమంత్ ప్రభాస్, మణి ఏగుర్ల, మౌర్య చౌదరి మంచి స్నేహితులు. ఈ పాట ఒకరితో ఒకరు సన్నిహిత బంధాన్ని తెలిజేస్తుంది. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాని సుమంత్ ప్రభాస్ స్వయంగా రచించి, దర్శకత్వం వహించగా, అనురాగ్ రెడ్డి, శరత్, చంద్రు మనోహరన్ కలిసి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి శ్యామ్ దూపాటి సినిమాటోగ్రాఫర్, సృజన అడుసుమిల్లి ఎడిటర్. అరవింద్ మౌళి ఆర్ట్ డైరెక్టర్. రేపు హైదరాబాద్‌లోని క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్‌లో జరగనున్న ఈ సినిమా ట్రైలర్ లాంచ్ కార్యక్రమానికి నేచురల్ స్టార్ నాని హాజరుకానున్నారు. అల్లు అరవింద్ గీతా ఆర్ట్స్ ఫిల్మ్ డిస్ట్రిబ్యూషన్ ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేయనుంది. మే 26న మేమ్ ఫేమస్ సినిమా థియేటర్లలోకి రానుంది.

తారాగణం: సుమంత్ ప్రభాస్, మణి ఏగుర్ల, మౌర్య చౌదరి, సార్య, సిరి రాశి, నరేంద్ర రవి, మురళీధర్ ,శివ నందన్




Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950